ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగష్టు 20, 2017
స్నేహ
గమ్మత్తు
ఆటలు

స్పోర్ట్స్ స్టార్

బాలీవుడ్‌లో బయోపిక్స్ క్రేజ్ ఎక్కువనే చెప్పాలి. ఒకప్పుడు చరిత్రకి సంబంధించిన బయోపిక్స్ ఓ సంచలనమైతే ప్రస్తుతం కాస్త ట్రెండ్ మారింది. క్రీడాకారుల బయోపిక్స్ నేటి తరాన్ని ఆకట్టుకుంటున్నాయి. క్రీడాకారుల జీవిత కథాంశంతో వచ్చిన చిత్రాలు కొన్ని సెంచరీలు పూర్తిచేసుకుంటే మరికొన్ని ప్రేక్షకులని థియేటర్ల వైపు పరుగుతీయించాయి. ఇంతకీ ఆ చిత్రాలేంటనేనా మీ సందేహం? వేలాది అభిమానులని పోగేసుకున్న ధోని, అజర్, సచిన్ లాంటి క్రికెట్ స్టార్స్‌తోపాటు పరుగుల వీరుడు మిల్కా సింగ్, మేరీ కోమ్‌లపై వచ్చిన 'ధోని', 'భాగ్ మిల్కా భాగ్', 'అజహర్', 'బుధియా సింగ్ బార్న్ టు రన్' లాంటి చిత్రాలన్నీ బాలీవుడ్ హిట్‌లిస్ట్‌లో చేరిపోయాయి. క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ బయోపిక్ 'సచిన్ ఎ బిలియన్ డ్రీమ్స్' వేలాది ప్రేక్షకులని థియేటర్లలో కట్టిపడేస్తే. హాకీ క్రీడాకారుడు మిర్ రాంజన్ నేగి జీవితానికి సంబంధించి అరుదైన విషయాలని ప్రేక్షకులకు అందించిన చిత్రం 'చక్ దే ఇండియా'. స్టీప్లేఛేజ్‌లో జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న పాన్‌సింగ్ తోమర్. బయోపిక్‌లు ప్రేక్షకుల అభిమానంతోపాటు అవార్డులని దక్కించుకున్న చిత్రాలు. కుస్తీలో ఆరితేరిన ఫొగాట్ సిస్టర్స్ బయోపిక్ 'దంగల్' 2016లో ఓ సంచలన చిత్రంగా నిలిచింది. ఇప్పుడు బాలీవుడ్‌లో సానియా, సైనా నెహ్వాల్ బయోపిక్స్‌పై డైరెక్టర్లు దృష్టిపెట్టారు. ఇప్పటికే సానియా బయోపిక్‌కి పరిణీతిని సెలెక్ట్‌చేస్తే, సైనా బయోపిక్‌కి శ్రద్ధా కపూర్, దీపికా పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇక పారాలింపియన్ మరియప్పన్ తంగవేలు కథాంశంతో రాబోతున్న తమిళ చిత్రం నిర్మాణ దశని పూర్తిచేసుకోనుంది.



కథా నిలయం
ENTERED
KSR02B181

బైచుంగ్ భూటియా, సునీల్ ఛేత్రి... ఈ పేర్లు ఫుట్‌బాల్ మీద అంతోకొంత అవగాహన ఉన్నవారికి తెలిసే భారత స్టార్ ఆటగాళ్ల పేర్లు. అదే బెంబెమ్ దేవి పేరు చెబితే ఆమె ఎవరో కూడా సరిగా తెలీకపోవడం పెద్ద విశేషమేమి లేదు. ఆమె ఓ అన్‌సంగ్ హీరో. మహిళా ఫుట్‌బాల్‌లో ఓ లెజెండ్ అయినా కూడా పెద్దగా గుర్తింపు లేకుండానే 20 ఏళ్ల కెరీర్‌ను డ్రిబుల్ చేసేసింది. ఫుట్‌బాల్‌లో అమ్మాయిలు కనిపిస్తున్నారంటే ఈ విజేతే స్ఫూర్తి వారికి.



బెంబెమ్ గోల్

అలుపన్నది లేకుండా మిడ్ ఫీల్డ్ కాచుకునే ఈ డైనమోది మణిపూర్. మైదానంలో పాదరసంలా కదిలే బెంబెమ్ దేవి 21 ఏళ్ల పాటు ఫుట్‌బాల్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తూనే ఉంది. కెరీర్ మొత్తంలో 85 క్యాప్‌లు సాధించిన అరుదైన క్రీడాకారిణి. అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు స్వర్ణ వెలుగులు అందించిన బెంబెమ్ క్రీడాప్రస్థానం ఇంఫాల్‌లోని పయోనీర్స్ క్లబ్ ద్వారా 1988లో మొదలైంది. సోదరుడితో కలసి ఫుట్‌బాల్ మైదానానికి వెళ్లిన బెంబెమ్ ఆట పట్ల ఆసక్తిని పెంచుకుంది. ఆమెకు కురచ జుట్టు ఉండటంతో అబ్బాయనే అనుకుని ఓసారి టీమ్‌లో ఆడించుకున్నారు. బెంబెమ్‌కు అంతకుముందు నుంచే ఫుట్‌బాల్ బానిస. ఆమె ఎలా కావాలంటే అలా గిరికీలు తిప్పించి ఆడించగలదు. ఈ విషయం పిషుమ్‌తాంగ్ ఒయ్‌నామ్ లైకైలోని తమింటి ప్రాంగణంలో ఆడుతున్నపుడు ఆమె సోదరులిద్దరికీ బాగా తెలుసు. అప్పటి వరకు గల్లీల్లోను, ఇంటి వసారాలోను దాచిపెట్టుకున్న ప్రతిభ విశాల మైదానాన్ని చూసేసరికి తన్నుకువచ్చేసింది. బంతి గోల్ పోస్ట్‌లో పడింది. ట్రోఫీ ఇంట్లోకి చేరింది. ఇప్పటికీ బెంబెమ్ సోదరుడి ఇంట్లో అది భద్రంగా ఉంది. బెంబెమ్ పేరు సరిగా రాక బోబో అని పిలిచేవారు. మణిపూర్‌లో అది అబ్బాయిల పేరు. ఆ పేరుతోనే క్లబ్‌లో సెలబ్రెటీ అయిపోయింది. ఫుట్‌బాల్ మ్యాచ్‌లు చూడ్డానికి వచ్చే ప్రేక్షకులు కూడా ఆమె అబ్బాయే అనుకుని బోబో అని కేకలు పెట్టేవారు. ఆమె క్రేజ్‌కు మరో కారణం ఆమె బంధువుల్లో ఒకరు ఎన్.రోనీబాలా జాతీయ జట్టుకు ఆడటమే. మణిపూర్ అంటేనే ఫుట్‌బాల్ ఆటకు చిరునామా. ఇక ఓ అమ్మాయి అబ్బాయిలతో పోటీ పడి వాళ్లను ఓడిస్తుంటే బెంబెమ్‌కు జాతీయ జట్టులో లైన్‌క్లియర్ అయినట్టే కదా. కానీ ఆమె చదువులోను అంతే పరుగులు పెడుతుంటే తండ్రికెందుకో క్రీడాకారిణిగా కన్నా కూతుర్ని ఉన్నత చదువుల వైపే మలచాలనుకున్నాడు. ఆయన ఫుట్‌బాల్ అంటే పడిచచ్చే అభిమాని అయినా కూడా బెంబెమ్‌కు అడ్డుతగిలాడు. ఎదుటి మనిషి వెనుక గోల్‌పోస్ట్ ఉంటే అతడి పక్కగా బంతిని కొట్టి గిరికీ తిప్పించి గోల్ సాధించడంలో పట్టుంది కదా తండ్రిని తప్పించుకుని మైదానానికి పరుగులు పెట్టేది. ఉమ్మడి కుటుంబం కావడంతో మిగతా వాళ్ల సాయం దక్కింది. పొద్దున్నే పిన్ని సైకిలేసుకుని ఇంటి బయట ఎదురుచూస్తుంటే... సోదరులు ఇంట్లోవాళ్ల కన్నుగప్పి ఆమెను ప్రహరీ దాటించేవాళ్లు. అలా రోజూ మైదానానికి వెళ్లి ఫుట్‌బాల్ ఆడుకొచ్చేది. అలాగే పరుగు పందేల పిచ్చిలోను పడిపోయింది. ఆటల్లో గాయాలై మోకాళ్లు చీలితే తల్లిదండ్రులు గమనించి మరింత దెబ్బలు కొడతారని ప్యాంట్లు వేసుకుని తిరిగేది. అయినా విషయం ఇంట్లో వాళ్లకు తెలిసిపోయేది. అమ్మ ఇళ్లు అదిరిపోయేట్టు చీవాట్లు పెడితే నాన్నతో తన్నులు తినాల్సివచ్చేది. సోదరులు అడ్డొచ్చి చీవాట్లు, దెబ్బలు పంచుకుని బెంబెమ్‌ను అక్కడి నుంచి తప్పించేవాళ్లు. అలా ఆట నేర్చుకున్న బెంబెమ్ జీవితం మలుపు తిరిగింది 1991లో. ఇంఫాల్‌లో జరిగిన జాతీయ మహిళల చాంపియన్ ట్రోఫీ పోటీలను చూడ్డానికి వెళ్లిన బెంబెమ్‌కు ఎంతో మంది అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతూ కనిపించారు. అప్పటి వరకు తాను మాత్రమే అబ్బాయిల జట్టులో ఆడుతూ ఉండేసరికి వీళ్ల గురించి సరిగ్గా తెలీదు. మహిళలకు కూడా ఫుట్‌బాల్‌లో కెరీర్ ఉందనే విషయం స్పష్టమయ్యాక ఇక ఆ క్రీడకే పూర్తిగా అంకితమైపోయింది. అదే ఏడాది యావా అనే ఫుట్‌బాల్ క్లబ్‌లో చేరి రోహ్‌తక్‌లో జరిగిన జాతీయ సబ్ జూనియర్ పోటీల్లో మణిపూర్ తరపున ఆడేసింది. తన అద్భుతమైన ప్రతిభతో కేవలం రెండేళ్లలో మణిపూర్ సీనియర్ జట్టులో చోటు దక్కించుకుంది. అప్పటికి నాన్న మనసు మారింది. ఆయన అండ తోడవడంతో పాఠశాల తరగతుల విషయంలోను టీచర్లు మినహాయింపునిచ్చారు. అలా అందరూ ఆమెకు వెన్నుదన్ను అవ్వడంతో పూర్తిగా ఆటపైనే దృష్టి పెట్టింది. కేవలం 15 ఏళ్ల వయస్సుకే సీనియర్ జట్టులో చోటు సంపాదించుకుని ఎంతో కీలకమైన మిడ్‌ఫీల్డ్ క్రీడాకారిణిగా పేరుతెచ్చుకుంది. క్రీడాశాఖ నుంచి అరకొర సాయం ఉండటంతో క్రీడాకారులు వేరే ప్రాంతాల్లోని మ్యాచ్‌లకు సొంత డబ్బుతో వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. క్లబ్‌ల తరపున ఆడటం కూడా దీనికి ప్రతిబంధకమే. ఇంటి పరిస్థితిని అర్థం చేసుకుని ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఖర్చులకు చూసుకునేది బెంబెమ్. మలేసియాలో జరిగిన ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి అంతర్జాతీయ వేదిక మీద అడుగుపెట్టింది బెంబెమ్. జట్టులో ఆమే చిన్నది. కోచ్ కోటాలో స్థానం దక్కడంతో ఆమె ప్రతిభ విలువనిచ్చారని అర్థం చేసుకుంది. కోచ్‌ల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఆమె తన సత్తా ఏంటో నిరూపించుకుంది. సన్ క్లబ్‌లో కోచ్ అయిన ఏకేంద్ర సింగే ఇప్పటికీ ఆమెకు శిక్షణనిస్తున్నారు. 2003 నాటికి బెంబెమ్ కెప్టెన్ అయిపోయింది. థాయ్‌ల్యాండ్‌లో జరిగిన ఆ పోటీల్లో తర్వాత ఆమె జట్టుకు ఎన్నో సేవలు అందించింది. మణిపూర్ క్రీడాకారిణులే ఎక్కువ ఉండే ఫుట్‌బాల్ ఆటలో మిగతా ప్రాంతాల వారితో కలసిమెలసి ఉండేందుకు తగ్గ వాతావరణాన్ని నెలకొల్పడంలో ఆమె ఆలోచనలే కారణం. 14 సార్లు నేషనల్స్‌లో జట్టుకు విజయాన్ని అందించిన బెంబెమ్ అవసరం ప్రపంచ కప్, ఒలింపిక్స్ క్వాలిఫైయింగ్ పోటీలపుడు భారత జట్టుకు తీవ్రంగా ఉంటుంది. ఏసియన్ గేమ్స్, ఏఎఫ్‌సీ టోర్నమెంట్‌ల్లో దేశానికి పతకాలు వస్తున్నాయంటే బెంబెమ్ పాత్ర చాలా ఉంటుంది. ఓ రకంగా ఆమె సహచర క్రీడాకారిణిగానో, కెప్టెన్‌గానో కాక కోచ్ స్థాయిలో తోటి క్రీడాకారిణులు చూస్తుంటారు.

దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ కప్‌ను మూడు సార్లు, దక్షిణాసియా గేమ్స్‌లో రెండు విజయాల్ని ఆమె ఆడుతున్నపుడే జట్టు చూసింది. విదేశీ క్లబ్‌లకు ఆడిన తొలి భారతీయ మహిళా ఫుట్‌బాలర్‌గా కూడా ఆమె ప్రత్యేకత చాటుకుంది. మాల్దీవుల్లో జరిగిన ఆ టోర్నీలో తను ఆడిన న్యూ రేడియంట్ క్లబ్‌కు లీగ్ టైటిల్ అందించడమే కాక టాప్ స్కోరర్‌గా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌ను దక్కించుకుంది. తర్వాతి తరానికి మైదానాన్ని విడిచిపెట్టినా మహిళా ఫుట్‌బాల్‌కు ప్రాచుర్యాన్ని తేవడానికి ఫుట్‌బాల్ చుట్టూతానే ఆమె జీవితం తిరుగుతోంది. ★

ఇండెక్స్

స్ఫూర్తి 3
అగ్గి మహిళ

స్టార్ 4
ప్రకృతి చిత్రకారుడు

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
ఆకలేస్తే కరెంట్ తింటా..!

తెలుసా............... 11
బానిస బతుకులు

కవిత్వమ్...............14
ముసురు

గమ్మత్తు ఆటలు

అట్టమీది కథ...6

నీడల జాడ ఆపాత చిత్రం- 12

కథ 15
కాటుక కరిగింది

ప్రత్యేకం 17
తిండి మారింది

కొత్త పుస్తకాలు 18
నీటి కోసం పగులుతున్న సీమ గొంతులు

రుచి......................21
స్టఫ్డ్ పూరీలు

బాల నేస్తాలు.............23
ఫింగర్ పపెట్

పద వికాసం........24

ఆకట్టుకున్నాయి

ఆదివారం 6-8-17 అనుబంధం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రత్యేకించి 'మంచి మనసులు' చిత్ర రాజాన్ని గురించి ఇచ్చిన విషయాలు నన్ను మిక్కిలి ఆకర్షించాయి. మంచి మనసులు చిత్రంలో వచ్చిన పాటలు మళ్ళీ విని ఆనందించాం. రంగారావుగారి నటన ఆయన గాంభీర్యం అన్నీ చిత్రానికి ఒక హైలెట్. చిత్రంలో సావిత్రి నటనపై ఇచ్చిన కొన్ని అంశాలు బాగున్నాయి. ప్రతి చిత్రంలో పాత్రలో లీనమవుతూ ఆ పాత్రలో జీవించే తన నటనా పాటవాలు నేటి తరం నటులకి మార్గదర్శకాలు. కెన్యాలో మన తెగ, 'ఈ తకు ట్రాఫిక్ లేదు', 'ఓ అమ్మ కథ' చదివించాయి. 'నవ్వుల్ పువ్వుల్ ' బాగున్నాయి. ప్రతి వారం చక్కని అంశాలను ప్రచురించడం అభినందించదగ్గ విషయం.

కై.ప నాగరాజు, అనంతపురం

స్నేహబంధం

స్నేహానికి కుల మతాలతో పనిలేదు స్థలం లేదు. భాష లేదు. లింగబేధం సరిహద్దులతో పనిలేదనే విషయాల్ని చేగువేరా కాస్ట్రో స్నేహబంధాన్ని కళ్ళకుకట్టినట్టు చేసిన ఈ

వారం అట్టమీది కథ స్నేహం...త్యాగం.... విప్లవం చదివించింది. కుటుంబ కథా నేపథ్యంతో వచ్చిన ఆపాత చిత్రాలు కలకాలం ప్రేక్షకులకి గుర్తుండిపోతాయి. అలా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయిన అలనాటి చిత్రం 'మంచి మనసులు' సినీ ప్రస్థానం ఆకట్టుకుంది. నిద్రలేకుండా ఎంతో సేపు వుండలేం. అలాంటిది నిద్రపోతే శ్వాస ఆగిపోయే ఓ అరుదైన వ్యాధితో బాధపడుతున్న లియామ్ కథనం కళ్ళు చెమర్చింది. సినీ రంగంలో వివిధ విభాగాల్లో ఎక్కువమంది పురుషులే కనిపిస్తారు. అలాంటి ఓ అరుదైన రంగంలో ప్రవేశించి కెమేరా పర్సన్‌గా ముందడుగేస్తున్న సవితా సింగ్‌కి హ్యాట్స్ ఆఫ్. 'ఓ అమ్మ కథ', నవ్వుల్ పువ్వుల్ బాగున్నాయి.

-అంకిత, విజయనగరం.

ఓ అమ్మ కథ

అమ్మాయిలు ఇంటికి రావడం కాస్త ఆలస్యమైతే చాలు తల్లి దండ్రులు కంగారుపడుతుంటారు. కొన్నేళ్ళుగా ఇలాంటి ఓ బాధనే భరిస్తూ... తప్పిపోయిన తన కూతురిని వెతికి పట్టుకునేందుకు ఇప్పటికీ తన ప్రయత్నం కొనసాగిస్తున్న ట్రిమార్కోకు హ్యాట్స్ ఆఫ్. 'మళ్ళీ నలుపు తెలుపులు' ఫోటో ఫీచర్, మరో అమ్మ , విద్యార్థి కథ ఆకట్టుకున్నాయి. 'సెల్ఫ్‌ల పురాతన గ్రామం' చివరి అట్ట చిత్రాల నుంచి చూపు మరల్చలేక పోయాం. 'స్నేహం...త్యాగం... విప్లవం' అట్టమీది కథ, 'ఓ అమ్మ కథ' చదివించాయి. 'నిద్రోస్తే అంతే', 'కాశ్మీర్ పోలీస్ అమ్మాయి, ' కెన్యాలో మన తెగ', ' ఈతకు ట్రాఫిక్ లేదు', 'అందరి చిరునామా ' ఆకట్టుకున్నాయి.

స్మైలీ.పీ , గుణదల

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ENTERED
కథా నిలయం

స్ఫూర్తి



నిప్పుని చూస్తే చాలామంది భయపడి పారిపోతుంటారు. మరి ఓ భవనం నిప్పుల్లో తగలబడిపోతుంటే .... అందులో చిక్కుకు పోయిన కొందరు ఆర్తనాదాలు చేస్తుంటే.... ఇలాంటివన్నీ ఊహించ డానికే భయంగొలిపే విషయాలు. అలాంటి ప్రమాదాల్లో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అందర్నీ కాపాడేది ఫైర్‌మెన్. ఇప్పటి వరకు మహిళలకు ప్రవేశంలేని ఆ వృత్తిలో అడుగు పెట్టింది హర్షిణి కన్వెకర్. తొలి మహిళా ఫైర్‌వుమన్‌గా తను చేస్తున్న కృషిని మీరూ తెలుసుకోండి.

అగ్గి మహిళ

హర్షిణి కన్వైకర్(37) ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహిళ. క్లాస్ రూమ్ చదువు కంటే బడిలో నిర్వహించే వివిధ పోటీల్లో చురుగ్గా పాల్గొనేది. స్కూల్ యూనిఫామ్ అంటే తనకెంతో ఇష్టం. నిజానికి వైవిధ్యమైన రంగాన్ని ఎంచుకోవడానికి ఈ యూనిఫామ్ కూడా కారణమే. లేడీ అమ్రితా బాయ్ యూనివర్సిటీలో చదువు పూర్తి చేసేసింది. ఆ తర్వాత డిగ్రీ బ్యాచులర్ సైన్స్‌లో చేరింది. కాలేజీలో నిర్వహించే అన్ని పోటీల్లో ముందుండే హర్షిణికి నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి)లో చేరాలని ఉపాధ్యాయులు సలహా ఇచ్చారు. ఎన్ సిసిలో సాహసోపేతమైన పనులని చేయడం అలవాటు చేసుకుంది. అప్పుడే సాయుధ దళాలలో చేరి శిక్షణ తీసుకోవాలను కుంది. అయితే అనుకోని కారణాలతో ఎమ్‌బిఏలో చేరింది హర్షిణి. అయితే తన అభిరుచి మాత్రం సాహసోపేతమైన వృత్తులపైనే వుండడంతో ఆ దిశగా తన ప్రయత్నాలు మొదలు పెట్టింది. సాయుధ దళాలకి సంబంధించిన వివిధ కోర్సులకి దరఖాస్తులు పంపించేది. అమ్మాయిలకి అనుమతి లేదంటూ వాటిని తిరస్కరించినా తన ప్రయత్నం మాత్రం కొనసాగుతూనే వుంది. అలా ఓ రోజు స్నేహితురాలి ద్వారా ఫైర్ ఇంజనీరింగ్ కోర్సు గురించి తెలుసుకొని దానికి దరఖాస్తు చేసింది. పరీక్ష రాసేందుకు తను స్నేహితురాలిని అడిగిన ప్రశ్న కోర్స్‌కి స్పెషల్ డ్రెస్ వుందా అని. విలక్షణమైన వృత్తుల్లో ప్రత్యేకించి రూపొందించిన డ్రెస్ కోడ్ వారి ధైర్యసాహసాలకి ప్రతీకగా వుంటాయనేది తన అభిప్రాయం. ఎమ్‌బిఏ చదువుతుండగానే నాగ్‌పూర్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజి నుండి కాల్ లెటర్ అందింది. తనతోపాటు ఈ పరీక్షకి హాజరయిన తన స్నేహితురాలికి కాల్‌లెటర్ అందలేదు. కోర్సులో చేరిన తర్వాత ఫైర్ సర్వీసెస్‌లో శిక్షణ తీసుకుంటున్న తొలి మహిళ తనే అన్న విషయం ఆశ్చర్యపరిచింది.

ఒకే మహిళ

ఈశాన్య ఆసియాలో పేరొందిన నేషనల్ ఫైర్ సర్వీస్ కళాశాలలో ప్రవేశంతో పాటు అక్కడ విద్యార్థులుగా కొనసాగటం మరింత కష్టమైన విషయం. మగపిల్లలతో కలిసి చదువుకోవడం కూడా హర్షిణికి అదే మొదటిసారి కావడంతో అక్కడ ప్రతిదీ తనకి సవాల్‌లా నిలిచింది. ఈ కోర్సు పూర్తి చేసేవారు హాస్టల్‌లో వుండడం తప్పనిసరి. అయితే ఇక్కడ హర్షిణి ఒకే ఒక్క అమ్మాయి కావడంతో క్లాసులు పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్ళేందుకు తనకి అనుమతి లభించింది. అయితే కోర్సులో భాగంగా వుండే మాక్ డ్రిల్, గుర్రపు స్వారీ ఇలా ఒక్కో శిక్షణ కోసం ప్రత్యేకమైన దుస్తులని వెంటవెంటనే మార్చుకోవాలి. అందు కోసం తరచు తను ఇంటికి వెళ్లాల్సి వచ్చినా టైమ్ సెన్స్‌ని అస్సలు మిస్సయ్యేది కాదు. తన పట్టుదల అందరినీ ఆశ్చర్యపరిచేది. తోటి విద్యార్థుల నుంచి ఎదురయ్యే వేధింపులతోపాటు ఫైర్ సర్వీసెస్ శిక్షణ తీసుకుంటున్న తొలి మహిళగా మీడియా ఫోకస్, కఠిన శిక్షణ ఇలా అన్నీ తనని ఉక్కిరిబిక్కిరి చేసినా లక్ష్యం వైపే దృష్టి పెట్టింది హర్షిణి కన్వెకర్.



శిక్షణలో వుండగానే కాలేజి యాజమాన్యం షిరిడీలో చోటుచేసుకున్న సిలిండర్ పేలుళ్లలో అక్కడి ఫైర్ సిబ్బందితో కలిసి పనిచేసేందుకు పంపింది. అంత పెద్ద ప్రమాదాన్ని చూసింది కూడా అప్పుడే. ఫైర్ సిబ్బందితో కలిసి పనిచేయడం కూడా అదే తొలిసారి అయినా తన ధైర్య సాహసాలని ప్రదర్శించి పరిస్థితులని అదుపులోకి తీసుకువచ్చింది హర్షిణి బృందం. ఓ సారి ఢిల్లీలో ఓ తగరపు ఫ్యాక్టరీలో నిప్పులు చెలరేగటంతో ఆ భవనం పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. అందరిలో భయాందోళనలు మొదలయ్యాయి. అక్కడ పనిచేస్తున్న వారిని మంటల్లో నుండి బయటకి తీసుకు రావడంతోపాటు పరిస్థితులని అదుపు చేసేందుకు సిబ్బందితో కలిసి ఏకధాటిగా ఆరేడు గంటలు పనిచేసింది హర్షిత. ఇలాంటి సందర్భాలెన్నో. ఢిల్లీ, కోల్‌కత, ముంబయి నగరాల్లో చోటుచేసు కున్న అగ్ని ప్రమాదాలతో పాటు వరదలు, అడవి జంతువుల దాడులు, భవనాలు కూలిపోయిన సందర్భాల్లో గాయపడిన వారిని రక్షించడంలో సాహసోపేతంగా పనిచేసేది. 2006లో గుజరాత్‌లోని మెహసాన్ స్టేషన్ దగ్గరలో వున్న ఓఎన్‌జిసిలో పనిచేస్తూనే అక్కడున్న అతిపెద్ద ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టింది. ప్రస్తుతం ఫైర్ సర్వీసెస్ డెప్యూటీ ఛైర్మన్‌గా విధులు నిర్వహిస్తూ ఎక్కువ మంది ఆడపిల్లలు ఈ రంగంలోకి వచ్చేలా ప్రోత్సహిస్తోంది హర్షిణి.

\- శర్వాణి



ప్రకృతి చిత్రకారుడు

'భూమిని కాపాడటానికి చిత్రాన్ని తీసిన మొదటివాడు అల్ గోరెనే కాదు' అని టైమ్ పత్రిక ఓ భారతీయుడి విశిష్టతని ఓ నోబెల్ గ్రహీతను పోల్చి చెప్పింది. తన చిత్రాల ద్వారా వన్యప్రాణి సంరక్షణ, భూతాపం, ప్రకృతి పరిరక్షణ వంటి అంశాల మీద అవగాహన కలిగిస్తున్న ఆ ప్రకృతి ఫిల్మ్‌మేకరే మైక్ పాండే. కెన్యాలో పుట్టి పెరిగిన ఈ ప్రవాసీ తిరిగి భారత్‌ను వెతుక్కుంటూ వచ్చి ఇక్కడి ప్రకృతితో ప్రేమలో పడి దానికి అవుతున్న గాయాల మీద చిత్రాలు తీయడం మొదలెట్టాడు. గ్రీన్ ఆస్కార్‌ను అందుకున్న తొలి ఆసియావాసి అయిన ఆ ప్రకృతి చిత్రకారుడి గురించి కొన్ని వివరాలు...

నైరోబిలోని జాతీయ వనం దగ్గర ప్రాంతంలో మైక్ పాండే జన్మించారు. చిన్నప్పటి నుంచి ప్రకృతి ఒడిలో పెరగడం వల్ల తన సోదరుడు ఈశ్వర్, మైక్ ప్రకృతి ప్రేమికులుగా పెద్దవాళ్లయ్యారు.

◆ మైక్‌కు ఏడేళ్ల వయస్సున్నపుడు బంధువు ఒకరు కొడాక్ బ్రౌనింగ్ బాక్స్ కెమెరాను బహుమతిగా ఇచ్చారు.

◆ దాన్ని తీసుకుని జాతీయ వనంలోని సీతాకోక చిలుకల వెంట, చిటారు కొమ్మన నక్కిన పక్షుల వెంట పడ్డాడు. ప్రకృతి చిత్రకారుడిగా తనకు కొత్త వ్యూ పాయింట్‌నిచ్చిన ఆ కెమెరాను ఇప్పటికీ ఎంతో భద్రంగా దాచుకున్నారు.

◆ సోదరులిద్దరూ యూకే, అమెరికాల్లో చలన చిత్ర సాంకేతికతను అభ్యసించారు. హాలీవుడ్‌లో స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగంలో పనిచేశారు.

◆ ఆ తర్వాత భారత్ వచ్చి రజియా సుల్తానా, బేతాబ్, గజబ్ వంటి చిత్రాల్లోని యుద్ధ సన్నివేశాలకు మెరుగులు దిద్దారు.

◆ అప్పుడే భారత్‌లోని ప్రకృతితో ప్రేమలో పడిపోయారు మైక్. ప్రధాన స్రవంతి చిత్రాల కన్నా వన్యప్రాణి చిత్రాలపైనే మనసు పడ్డారు. అలా పూర్తిగా ప్రకృతి చిత్రాలకే అంకితమైపోయారు.

◆ సుర్గుజాలో ఏనుగుల వలస గురించి ఆయన తీసిన **'ది లాస్ట్ మైగ్రేషన్'** (1994) చిత్రానికి గ్రీన్ ఆస్కార్‌గా పిలిచే 'వైల్డ్ స్క్రీన్ పాండా' అవార్డు దక్కింది.

◆ ఆ తర్వాత 2000లో వచ్చిన **'షోర్స్ ఆఫ్ సైలెన్స్: వేల్ షార్క్స్ ఇన్ ఇండియా'** చిత్రానికి కూడా రెండోసారి గ్రీన్ ఆస్కార్ అందుకున్నారు. సొరచేపల అక్రమ వేటలోని హింస, అకృత్యాలు, ప్రకృతి అసమతుల్యత ప్రభావాలు వంటి అనేక అంశాలను కళ్లకు కట్టారు.

◆ ఈ చిత్రం ఎంత ప్రభావాన్ని చూపిందంటే ఆ తర్వాత.. భారత తీర ప్రాంతంలో వేల్ షార్క్ అక్రమవేటను అడ్డుకునేందుకు ఓ చట్టమే వచ్చింది.

◆ ఈ చిత్రానికి 2005లో 'ఎక్స్‌ప్లోరేషన్ అండ్ అడ్వెంచర్' విభాగంలో జాతీయ అవార్డు దక్కింది.

◆ 2004లో తీసిన **'వానిషింగ్ జెయింట్స్'** చిత్రం ఏనుగులు కనుమరుగవుతున్న విషయంపై పెద్ద చర్చనే లేవదీసింది. ఆ చిత్రానికి మూడోసారి గ్రీన్ ఆస్కార్ అందుకున్నారు మైక్ పాండే. ఈ చిత్రం వల్ల ఏనుగులను బంధించే హింసాత్మక పద్ధతులపై నిషేధం అమల్లోకి వచ్చింది.

◆ జావా, ఇండోనేషియాల జీవనది సితారమ్ కాలుష్యంపై ఆయన చిత్రం.. సంపద వేటలో పడి ప్రకృతి హననానికి ఎలా కారకులౌతున్నారనే దారుణ వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది.

◆ తేనెటీగలు తుడిచిపెట్టుకుపోవడం ప్రకృతి సమతుల్యత విషయంలో ఎంత తీవ్ర పరిణామాలకు దారితీస్తుందనే అంశం, ప్రత్యేకమైన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల జీవావాసాల ప్రమాదకర స్థితి అంశం, మంచు చిరుత, నీటి ఏనుగులు, తెల్ల పులులు, పూలు ఇలా అనేక అంశాలపై ఆయన చిత్రాలు విలువైన సమాచారాన్ని, అవగాహనను అందిస్తాయి.

◆ తరచూ అంతర్జాతీయ పత్రికల్లో వ్యాసాలు రాస్తూ భావి వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లకు, ప్రకృతి పరిరక్షకులకు విజ్ఞానాన్ని అందిస్తుంటారు. నేషనల్ జాగ్రఫిక్ పత్రికలో వచ్చిన 'థింక్ బిఫోర్ యు క్లిక్' అనే వ్యాసం ప్రకృతిని ఏ వ్యూపాయింట్‌లో చూడాలనే విషయాన్ని విశ్లేషిస్తుంది.

◆ భౌగోళిక వారసత్వంగా గుర్తించిన వేల్ షార్క్‌ల సంరక్షణకు ఆయన చిత్రాలు ఉపయోగపడటంతో పృథ్వీ రతన్‌తో పాటు ఐక్యరాజ్యసమితి గౌరవాలు పొందారు మైక్.

◆ భూమి-ప్రకృతి-వన్యప్రాణుల అంశాలను వివరించేందుకు ఆయన రూపొందించిన టీవీ కార్యక్రమాల సిరీస్ 'ఎర్త్ మేటర్స్'కు అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయి. ఈ సిరీస్ చాలామందిలో ప్రకృతి సమతుల్యత గురించి చక్కటి అవగాహన కలిగించింది.

◆ చిన్నారులను లక్ష్యం చేసుకుని రూపొందించిన 'ఖుల్లమ్ ఖుల్లా' కూడా ఉత్తమ వైజ్ఞానిక, విద్యా కార్యక్రమంగా పేరొందింది.

◆ 30 ఏళ్ల కెరీర్‌లో 600కు పైగా ప్రకృతి చిత్రాలు తీసిన మైక్ పాండే భౌగోళికంగా ప్రభావవంతమైన వ్యక్తిగా కీర్తిపొందారు.

◆ అమితాబ్ బచ్చన్, జాన్ అబ్రహంతో కలిసి 'ది రిటర్న్ ఆఫ్ ది టైగర్' చిత్రానికి పనిచేశారు మైక్. అరణ్యాల వద్ద నివసిస్తోన్న గ్రామీణులకు సాయం చేస్తూనే పులుల్ని ఎలా రక్షించుకోవాలనే అంశంపై ఓ బ్లూ ప్రింట్‌లా ఈ చిత్రాన్ని పేర్కొంటారు.



◆ ఇప్పటి వరకు 300 అవార్డులను మైక్ పాండే పొందారు. అవన్నీ కూడా జీవ వైవిధ్యం గురించి తీసిన చిత్రాలను గుర్తిస్తూ ఆయన్ను గౌరవించినవే.

◆ 2009లో హీరో ఆఫ్ ది ఎన్విరాన్‌మెంట్ అనే పురస్కారాన్ని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ నషీద్, కేమరూన్ డియాజ్‌తో కలసి అందుకున్నారు. ఫ్రాన్స్ అత్యుత్తమ పర్యావరణ పురస్కారం 'గోల్డెన్ జిరాఫీ'ని కూడా ఆయన పొందారు.

◆ పీతల దగ్గర నుంచి సొర చేపలు, ఏనుగులు, రాబందులు, పులుల వంటి వివిధ జీవ వైవిధ్యాల్లోని వన్యప్రాణుల స్థితిగతుల మీద ఆయన తీసిన డాక్యుమెంటరీలు చాలా విలువైనవి.

◆ 'ఎర్త్ మేటర్స్' అనే పేరిట ఓ ఫౌండేషన్‌ను ప్రారంభించిన మైక్ పాండే నవతరానికి ప్రకృతి చిత్ర వారసత్వాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నారు.

- జేమ్స్

నవ్వుల్ - పువ్వుల్

కథా బలం

సుబ్బారావు : నేను తీయబోయే సినిమాకి బలమైన కథ రాయమన్నాగా ఎంతవరకు వచ్చింది.
వెంకట్రావు : రోజూ జిమ్‌కి వెళుతున్నాను సార్...! బలం రాగానే రాయడం మొదలు పెడతా...
సుబ్బారావు : ఆ....

అతితెలివి

టీచర్ : వారం రోజులుగా చూస్తున్నా రోజూ ఒక చెవిలో దూది పెట్టుకొస్తున్నావ్ ఏంటి బంటి?
బంటి : ఒక చెవితో విని మరో చెవితో వదిలేయకుండా పాఠం వంటబట్టించుకోమని మీరే చెప్పారుగా టీచర్!

కంటి చూపు

చందు : నాన్నా నాకు సైకిల్ కొనివ్వు... నేను స్కూల్‌కి నడుచుకుంటూ వెళ్ళలేకపోతున్నా....
తండ్రి : పక్కింటి గీతని చూడు.... ఎంచక్కా స్కూల్‌కి నడుచుకుంటూ వెళుతోందో....
చందు : ఇక్కడి నుంచి నాకేం కనిపించట్లేదు.

కిసుక్కు

చంటి : ఈ రోజు నేను మా స్కూల్ పేరు నిల బెట్టా డాడీ!
తండ్రి : అంతగొప్ప పని నువ్వేం చేశావురా....
చంటి : ఈదురుగాలికి స్కూల్ నేమ్ బోర్డ్ పడిపోతే....బోర్డును నిలబెట్టి మళ్ళీ కట్టొచ్చా......!
తండ్రి : ఆ.....!!

మతిమరుపు

రోగి : మతిమరుపు తగ్గడానికి మీరిచ్చిన మందు బాగా పనిచేసింది. మరి కొన్ని రోజులు ఈ మందులనే వాడమంటారా డాక్టర్.



డాక్టర్ : తప్పకుండా వాడాలి. ఎందుకంటే మీకా మందిచ్చింది నేను కాదు!

ఎక్కడికీ వెళ్ళదు

వెంకీ : ఈ రోడ్డు ఎక్కడికివెళు తుంది??
వెంగళప్ప : రోడ్డు వేసినప్పటి నుంచి చూస్తున్నా ..... ఎక్కడికీ వెళ్ళలేదు. ఇక్కడే వుంది.

కిసుక్కు సిత్రం



పదరా తమ్ముడు సంగతి చూద్దాం..!

నాకు నచ్చిన చిత్రం



ఇల్లస్ట్రేషన్: రఫెల్ వొల్బెన్స్కి

సేకర్త: ప్రభాకర్, మచిలీ పట్నం

గమ్మత్తు ఆటలు

ఈరోజు ఏ ఆట ఆడబోతున్నారు? క్రికెటా, షటిలా, కనీసం క్యారెమ్సా..! ఏది ఆడినా మంచిదేలెండి. కానీ సరదాగా ఆడుకోండే. ఆ సరదా ఆ ఆటల్లో ఉండదులెండి సీరియెస్‌గా గెలవాల్సిందే అంటే. ఈ ఆటల్లో పడేందుకు ప్రయత్నించండి. గమ్మత్తుగాను, వింతగాను, కొత్తగాను... 'అస్సలింటావి కూడా ఉన్నాయా..!' అనే ఆటలున్నాయి.. ఆడేసుకోండి బాబూ. కొన్ని సరదాగానే ఉన్నా సరదా తీర్చేస్తాయి. కొన్ని సింపుల్‌గానే అనిపించినా బోలెడు సంతోషాన్ని అందిస్తాయి. కొన్ని బంధాల్ని బాగా హత్తుకునేలా చేస్తాయి. మరికొన్ని కొత్త బంధాల్ని కనెక్ట్ చేసేలా ఉంటాయి. ఇలాంటి సరదా ఆటల గమ్మత్తు వివరాలు ఈ వారం అట్టమీది కథలో.

- ఈశ్వర్ నెట్టెం
9703161845

ప్రపంచ వ్యాప్తంగా 750 రకాల ఆటలను ఆడుతున్నట్లు అంచనా. ఇందులో 200 క్రీడల వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు ఉంది. ఇప్పుడు ప్రాచుర్యంలోకి వచ్చిన క్రీడలన్నీ దాదాపుగా 19, 20 దశాబ్దాల్లో పరిచయమైనవే ఎక్కువ. గడిచిన, పురాతన కాలానికి చెందినవి కూడా ఇప్పటికీ ఆడుతున్నవాటిల్లో ఉండటం గమనార్హం. వాటికి తుది మెరుగులు.. మెరుపులు... మార్పులతోనే కోట్ల మంది క్రీడల్లో మునిగి తేలుతున్నారు. క్రీడల్ని జీవితంగా బతికేస్తున్నారు. అయితే అన్నీ సీరియెస్ ఆటలే ఉంటాయనుకుని, నరాలు తెగ్గొట్టే ఉత్కంఠతో ఉంటుందనుకుని ఆటల వైపు గంభీరంగా చూడకండే. ఎందుకంటే సరదాగా ఆటపాటలతో హాయిగా సేదతీరేవి ఉన్నాయి.

వింతగా 'ఏంటీ ఇలా కూడా ఆడతారా' అని తెగ హాశ్చర్యపోయే గమ్మత్తు ఆటలు ఉన్నాయి. ఎదుటి వాళ్లు పొట్ట చక్కలై నవ్వేలా చేసేవి ఉన్నాయి. పక్కోడు గెలుస్తున్నా మనం పూర్తిగా ఆస్వాదించే క్రీడలూ ఉన్నాయి. ఈ తమాషా ఆటల కమామీషు భలే ఉందే అని మీరూ ఆడి సేద తీరాలి.

తొలినాళ్లలో రెజ్లింగ్, బాక్సింగ్ క్రీడలుగా కొనసాగాయి. అప్పట్లో సులభంగా వీటిల్లో పోటీలను నిర్వహించే వారు. పరుగుతో క్రీడలు మొదలయ్యాయనే వారూ ఉన్నారు. ఇలాంటి ఆటల వల్లే క్రీడలూ అనే ప్రత్యేక అలవాటు మనిషికి తెగ ఇంపార్టెంట్ అయిపోయింది. అదో ప్రత్యేక రంగంగా అభివృద్ధికి బీజం పడింది. వేగంగా మనుషుల ప్రయాణాలకు గుర్రాలను వాడేవారు. ఇందుల్లోంచే హార్స్ రైడింగ్, కనోయింగ్ అనే ఆటలు పుట్టుకొచ్చాయి. విలు విద్య క్రీడగా ఎప్పుడో ఉద్భవించిందని చెబుతారు. క్రీస్తు పూర్వం 760ల్లోనే భారీస్థాయిలో పురాతన ఒలింపిక్స్ పోటీలు జరిగినట్లు అందరు విరివిగా చదువుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందిన క్రీడ ఫుట్‌బాల్ (సాకర్). ఇది చైనాలో పుట్టిందని చెబుతారు. సాకర్ చరిత్రను పరిశీలిస్తే క్రీ.శ. రెండు, మూడు దశాబ్దాల్లో సైన్యంలో 'సు చు' అనే పేరిట ఓ క్రీడ ఉండేది. లెదర్ బాల్‌ను అటు ఇటు తన్నుకుంటూ ఓ

హాల్‌లోకి నెట్టేవారు. దీన్ని సాకర్ అనేవారు. ఈ గేమ్‌లో చేతులను వినియోగించరాదు. ఇలా క్రీడలు ప్రస్థానం ప్రపంచవ్యాప్తంగా ఎప్పుడో మొదలైపోయింది. అయితే యూరోపియన్ దేశాల్లో వింతలతోను, వినోదం పంచేవి గాను కొంత పుంతలు తొక్కాయి. ఆహ్లాదం, సరదా కోసం వివిధ స్వల్పకాలిక క్రీడలు తెరపైకి వచ్చాయి. వీటిల్లో కొన్ని అతి సాధారమైన క్రీడలను కొందరు ప్రముఖులు కనిపెట్టారు. ఇవి సగటు జీవుల్లో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపడంతో వినోదం పంచేవిగా కూడా ఉన్నాయి. వీటిని కూడా క్రీడలుగా అంగీకరించాల్సిందే. ఈ కోవలోనే ప్రపంచ వ్యాప్తంగా 15 క్రీడల వరకు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇందులో కొన్ని వింత గొల్పేవి కూడా ఉన్నాయి.

మోసేవాడు భర్త..!

'వైఫ్ క్యారీయింగ్' పేరిట జరిగే ఈ ప్రత్యేక పోటీలు భర్తలకు పరీక్ష పెడతాయి. పోటీల్లో పాల్గొనే దంపతుల్లో భార్యలకు ఈ గేమ్ జోష్‌ను పంచుతుందనడంలో సందేహం లేదు. భర్తలకు మాత్రం చుక్కలు కనిపిస్తాయి. భార్యను ఉప్పెకించుకుని అనేక అవాంతరాలను దాటుతూ ముందుకు వెళ్లాలి. బురదలో ఎక్కడ కాలు దిగిపోతుందో.. ఎక్కడ గుంత ఉందో తెలీదు. తీరా ఆ సవాలు దాటేశాక... సన్నని ప్లాంక్‌ల మీద



బ్యాలెన్స్‌డ్‌గా నడవాలి. ఇలా అనేక పరీక్షలు దాటితేనే పోటీ పూర్తవుతుంది. ఇక్కడ గెలుపు ఓటముల కన్నా ఈ చాలెంజ్‌లన్నింటినీ దాటేశామనే తృప్తే ఎక్కువ ఉంటుంది. తన భార్యను ఈ సవాళ్లన్నింటినీ దాటించామనే సంతోషం కలుగుతుంది. భార్యకు భర్త మీద విశ్వాసం పెరుగుతుంది. ఇది భార్యాభర్తల బంధాన్ని మరింత పటిష్టం చేస్తుందని అంటారు. ఈ నేపథ్యంలో ఓ కథ కూడా బాలీవుడ్‌లో సినిమాగా వచ్చింది. అది 'దమ్ లగాకే హైసా'. ఇంత ప్రత్యేకమైన ఈ ఆట ఆధునికమైందే. 1991లో తొలి పోటీలు ఫిన్‌లాండ్‌లో జరిగాయి. మిగతా దేశాల్లో ఈ పోటీలను 1995లో స్వాగతించారు. వీటికి క్వాలిఫైయింగ్ పోటీలను ఆస్ట్రేలియా, స్వీడన్, ఈస్తోనియా, ఉత్తర అమెరికాలో 1999లో సండే రివర్‌లో నిర్వహించారు. ఫిన్‌లాండ్‌లో ప్రతీ జూలైలో ఈ పోటీలను నిర్వహిస్తుంటారు. భారత్‌లో కూడా ఓ సొసైటీ ఈ పోటీలను జనవరి 1, 2011లో ప్రారంభించింది. ఇక్రౌన్ ఇండియా అనే సొసైటీ ఈ రకమైన రేస్‌ను కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో నిర్వహించింది. విదేశాల్లో గమ్మత్తు ఏమిటంటే... సొంత భార్య కాకపోయిన పక్కవారి తాలూక సతీమణిని అయినా వీపు మీద ఎక్కించుకుని పరుగు తీయవచ్చు. నేలమీద, నీళ్లల్లోను మోస్తూ 253.5 మీటర్లు పరుగు సాగించాల్సి ఉంటుంది. దీనికి ప్రత్యేకించి కొన్ని నిబంధనలు కూడా ఉన్నాయి. భార్య వయస్సు 17 ఏళ్లకు మించి ఉండాలి. బరువు 49 కేజీలకు తక్కువగా ఉండకూడదు. ఇందులో ఏదైనా ప్రమాదం సంభవిస్తే నిర్వాహకులకు ఎలాంటి సంబంధం ఉండదు. సేఫ్టీ కోసం భార్య తలకు హెల్మెట్ లేదా జారిపోకుండా ఉండేందుకు బెల్ట్‌ను ఉపయోగించుకోవచ్చు. గెలిచిన ఒక్కరితో కాకుండా ఇతర దంపతులకు ఆకర్షణీయమైన బహుమతులను అందివ్వడం విశేషం. ఈ పోటీల్లో ఎక్కువగా వినోదం పంచే జంటతో పాటు, అందమైన అలంకరణకు, అత్యంత బరువు మోసే భర్తలకు ప్రత్యేక బహుమతులు దక్కుతాయి.

చెస్సూ.. బాక్సింగ్‌నూ...

మనం అంతకు ముందు ఓ టీవీ యాడ్ చూసి ఉంటాం. ఒకడు చాలా బలవంతుడు చేయలేని పనిని తెలివితో విశ్వనాథన్ ఆనంద్



చేసేస్తాడు. ఆ తర్వాత ఎంచక్కా చెస్ బోర్డ్ మీద కూర్చుంటాడు. అంటే శారీరక బలం కన్నా తెలివి బలం ఎక్కువని ఉద్దేశం. కానీ ఈ ఆట ఆడాలంటే రెండూ ఉండాలి. ప్రత్యర్థిని మట్టికరిపించే కండ బలం ఉండాలి. చదరంగంలో పావుల్ని పెరికిపడేసే తెలివితనం ఉండాలి. బాక్సింగ్, చెస్ రెండు క్రీడాంశాలను కలగలిపిన రుబ్బేసిన గేమ్ ఇది. ఫ్రాయిడ్ 'ఈక్వేటార్' కామిక్ బుక్ నుంచి 1992లో రూల్స్‌ను క్రోఢీకరించారు. 2003లో డచ్‌లో తొలి ఈవెంట్ నిర్వహించారు. లండన్‌లో బాక్సింగ్ క్లబ్ బయట రాబిన్‌సన్ సోదరులు చదరంగాన్ని అలవాటుగా 1970 దశకంలోనే ఆడేవారు. ప్రత్యర్థితో తొలుత చెస్ పోటీల్లో తలపడతారు. అనంతరం బాక్సింగ్ క్లబ్‌లో

నూనెతో మల్ల యుద్ధం

ప్రపంచ వ్యాప్తంగా 'ఆయిల్ రెజ్లింగ్' ఏదో మూలన ఆడుతుంటారు. ఇది పురాతన క్రీడల్లో ఒకటిగా పేరొందింది. క్రిక్‌పైనర్, ఎడ్రిన్ టర్కీల్లో ప్రతీ ఏటా జూన్‌లో పోటీలను నిర్వహిస్తుంటారు. 1357 నుంచి ఓ పండుగలా విజయానికి చిహ్నంగా దీన్ని జరుపుతుంటారు. ఈ పోటీల్లో పహిల్వాన్లు ఒంటి నిండా ఆలివ్ ఆయిల్ రాసేసుకుంటారు. ఇలా చేయడం వల్ల మల్లయోధులకు ఎదుటివాళ్లపై పట్టు అస్సలు కుదరదు. ఎన్నో కుస్తీలు పడితే కానీ ప్రత్యర్థి చేతికి చిక్కడు. జారిపడుతూ పక్కకు ఒరుగుతూ వీరి పడే పాట్లను చూస్తే ప్రేక్షకులకు నవ్వాగదు. ఎక్కడైనా సీరియెస్‌గా పట్టు పడతారేమోగానీ వీరు మాత్రం ఆట మధ్యలో నవ్వకుండా ఉండలేరు. ఎదుటి వారిని ఎలా పట్టుకోవాలనే విషయంలో ఎవరి ఆలోచన ఎలా ఉంటుందనే ఊహకందని విధంగా పోరాటం జరుపుతారు. ఇదొక పండుగగా ఉత్తర గ్రీస్, తూర్పు మాసిడోనియాతో పాటు పశ్చిమ థ్రాస్‌ల్లో పోటీలు నిర్వహిస్తారు. ఈ అరుదైన కుస్తీ పాపులర్ గేమ్‌గా మారిపోయింది. ఇటీవల కాలంలో ఈ తరహా రెజ్లింగ్ నెదర్లాండ్స్, జపాన్‌ల్లో ప్రజాదరణకు నోచుకుంది.



పిడిగుద్దులు కురిపిస్తారు. ఈ రెండింటి మీద హాలీవుడ్ మూవీని 1979లోనే తీశారు. చెస్‌ను, బాక్సింగ్‌ను కలిపి వివిధ ఆల్టర్నేటివ్ రౌండ్లల్లో ప్రత్యర్థులిద్దరూ నువ్వానేనా అన్న రీతిలో తలపడతారు. ఈ గేమ్‌ను ఫ్రెంచ్ ఆర్టిస్ట్, ఫిల్మ్‌మేకర్ ఇంకి బిలాల్ కనుగొన్నాడు. ఇది వేగంగా ప్రపంచ వ్యాపంగా విస్తరించింది. ఇద్దరు పోటీదారుల మధ్య 11 రౌండ్ల పోటీని నిర్వహిస్తారు. ప్రతీ రౌండ్‌లో నాలుగు నిమిషాలు చెస్, 2 నిమిషాలు బాక్సింగ్‌లో తలపడాల్సి ఉంటుంది. ఈ సమయంలో వారు సాధించిన పాయింట్లను లెక్కగట్టి విజేతను నిర్ణయిస్తారు. 2003లో బెర్లిన్ నగరంలో తొలి చెస్ బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. అదే సంవత్సరం ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ను గ్రీస్‌లో డచ్ బాక్సింగ్ ఫెడరేషన్ నిర్వహించింది. దీంతో చెస్ బాక్సింగ్‌కు పుట్టినిల్లుగా బెర్లిన్ పేరు స్థిరపడింది. 2008 ఏప్రిల్‌లో అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ (ఫిడే) ఈ క్రీడకు గుర్తింపునిచ్చింది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో 2009లో చెస్ బాక్సింగ్ క్లబ్‌ను ఏర్పరచారు. 2011-2014లో ప్రొఫెషనల్ గేమ్‌గా మారింది. 2014 అక్టోబర్ నుంచి వివిధ కేటగిరీలుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రొ చెస్ బాక్సింగ్‌ను విస్తరించారు. లైట్ వెయిట్ (70 కేజీ), మిడిల్ వెయిట్ (80 కేజీ), లైట్ హెవీ వెయిట్ (90), హెవీ వెయిట్ (90 ప్లస్) పైన పురుషులకు, 55 కేజీలు, 65 కేజీలు, 75, 75 ప్లస్ పైన మహిళలకు ఈ పోటీలు జరుగుతున్నాయి.

బెడ్ రేసింగ్

ఈ క్రీడను నార్త్ యార్క్‌షైర్ టౌన్ నుంచి స్వీకరించారు. ఇది ఓపెన్ కాంపిటీషన్. 1965లో ఆర్మీ, నేవీ, అమెరికన్ మెరైన్ సిబ్బంది ఈ పోటీలను నిర్వహించేవారు. ఈ రేస్‌కు కావాల్సిందల్లా ఆరుగురు మనుషులు, ఓ బెడ్. ఓ మనిషిని బెడ్‌పై పడుకోబెట్టి నాలుగు చక్రాల బెడ్‌పై లాక్కెళ్లుతూ కొండలు, గుట్టలు ఎక్కిస్తూ చివరగా నదిని దాటాల్సి ఉంటుంది. కీలకమైన చివరి ఫీట్ నది దాటేయడం ఓ సవాల్ లాంటిది. ఎవరి బెడ్‌ను వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

గుర్రంతో పందెం

న్యూయార్క్‌లో న్యూవెడ్ ఆర్మ్స్ హోటల్‌లో ఓ బార్ వెనుక పిచ్చాపాటిగా ఇద్దరు వ్యక్తుల చర్చల్లో ఈ తరహా గేమ్‌కు బీజం పడింది. హోటల్ యజమాని, భూస్వామి గోర్డాన్ గ్రీన్‌కు ఈ ఐడియా 1980లో వచ్చింది. వచ్చిందే తడవుగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న తలంపుతో లాన్‌రెటెడ్ వెల్స్‌లో ఈ క్రీడను తెరపైకి తీసుకువచ్చాడు. దీంతో తన వ్యాపారాన్ని విస్తృత పరుచుకోవడానికి ఉపయోగించుకున్నాడు.



పరీక్షలో విజయం సాధించాడు. ఇది అంతర్జాతీయ ఈవెంట్‌గా రూపొదిద్దుకోవడానికి కారణం అయ్యాడు. 1982లో ఈ పోటీలను మనుషులు, గుర్రాలకు పెట్టి చూశాడు. మంచి ఆదరణ వచ్చింది. గుర్రంతో పాటు మనిషి దౌడు తీయడం, అదీ విజయం సాధించడమంటే పెద్ద పరీక్షే. 22 మైళ్లు పరుగెత్తడంలో మజా ఉన్నప్పటికీ గుర్రాలతో పోటీపడే దమ్ము మనిషికి ఉందా అనే అనుమానం కలుగుతుంది. ఈ మారథాన్ 1979లో ప్రారంభమైందని చెబుతారు. గుర్రం, మనిషి 22 మైళ్లు (35.4 కిలోమీటర్లు) మారథాన్‌లో పరుగు పెడతారు. విజేతకు 40 వేల డాలర్ల క్యాష్ ప్రైజ్ అందిస్తారు. వేల్స్(ఇంగ్లాండ్)లో ఈ తరహా పోటీలు జరుగుతాయి. గుర్రంతో పోటీ పడి మానవుడు ఒకటి, రెండు సార్లు మాత్రమే గెలిచినట్లు చెబుతారు. 2004లో ఈ రేస్‌లో హూ లాబ్ 2 గంటల 5 నిమిషాల 11 సెకన్లలో లక్ష్యాన్ని అధిగమించి తొలిసారి విజేతగా అవతరించాడు.

ఏనుగులతో పోలో...

పోలో క్రీడలో విభిన్నం ఎలిఫెంట్ పోలో. ఈ క్రీడను ప్రధానంగా నేపాల్, శ్రీలంక, థాయిలాండ్‌తో పాటు ఇండియాలో రాజస్థాన్‌లో



ఆడుతుంటారు. ఇంగ్లాండ్, స్కాట్లాండ్‌ల్లో నిరంతరం ఫీల్డ్ టీమ్స్ ఆడుతూనే ఉంటాయి. పిచ్‌ను మూడు భాగాలుగా విభజిస్తారు. వెదురుతో ఆరు నుంచి 10 అడుగుల స్టిక్స్‌కు చివరన ఒక పోల్ మేలట్‌ను అమర్చుతారు. ఏనుగులు తక్కువ వేగంగా పరిగెడతాయనే కారణంగా పిచ్ చిన్నదిగానే ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు ఏనుగును నడుపుతారు. క్రీడాకారుడు స్టిక్‌తో బంతిని హోల్‌లోకి నెడతాడు. బంతిని ఏనుగుపై నుంచే కొడతారు. యూరోపియన్ దేశాల్లో నిబంధనలు కఠినతరంగా ఉంటే మన ఆసియా ఖండంలో మనకు అనుకూలంగా నిబంధనలను మార్చారు. ఈ గేమ్‌లో ఏనుగుల హింసకు తావు ఉండకూడదు. 33వ ప్రపంచ ఎలిఫెంట్ పోలో అసోసియేషన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించింది. నేపాల్ బాడియా జాతీయ వనంలో జరిగింది. ఫైనల్ మ్యాచ్ మాగ్నెస్ 4-3తో ఈఎఫ్‌జీ- ఈక్వెస్టన్‌ను ఓడించింది. థాయిలాండ్‌లో ఎలిఫెంట్ పోలో కింగ్స్ కప్‌ను ప్రతీ ఏటా నిర్వహిస్తారు. మార్చి 9 నుంచి 12 వరకు బ్యాంకాక్‌లో చావ్రోయా రివర్‌లో 15 ఎలిఫెంట్ పోలో పోటీల్ని నిర్వహించారు. దక్షిణాసియాలో 1.3 మిలియన్ ప్రైజ్‌మనీతో ఇంత భారీ స్థాయి టోర్నీ నిర్వహించడం ఇదే ప్రథమం. ఏనుగులు సంతతిని మరింత వృద్ధి చేయడంతో పాటు పోటీదారుల సంఖ్యను పెంచేందుకు భారీగా పోటీలను నిర్వహించారు. సిలోన్ ఎలిఫెంట్ పోలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా శ్రీలంకలోని గాలెలో టోర్నీ నిర్వహిస్తారు.

సంగీతంతో బోసాబాల్

ఇది ఆకర్షణీయమైన, దర్శనీయ క్రీడల్లో ఒకటిగా పేరొందింది. దీన్ని స్పెయిన్‌కు చెందిన ఫిలిప్ ఎకమన్స్ 2005లో అభివృద్ధి చేశారు. ఇది

టీమ్ గేమ్. వాలీబాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్‌లను మ్యూజిక్‌కు అనుగుణంగా ఆడాల్సి ఉంటుంది. నేలకు సమాంతరంగా కోర్టుకు ఇరువైపులా ట్రాంప్ లైన్లు ఎదురుగా నెట్‌లుంటాయి. ట్రాంప్‌లైన్స్‌ను దాటుకుంటూ బంతిని బౌన్స్ చేసుకుంటూ నెట్‌లోకి బాల్‌ను నెట్టాలి. దీంతో డైరక్టుగా పాయింట్లు చేరతాయి. బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, టర్కీ, నెదర్లాండ్స్, స్పెయిన్, ఇజ్రాయిల్, ఈజిప్ట్, సౌదీ అరేబియాల్లో విస్తృతంగా ఆడుతుంటారు.

అడవిలో మారథాన్

ఈ రేస్ అత్యంత ప్రమాదకరమైందని చెబుతారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకంగా కూడా ఎంతో విశిష్టమైన సాహస క్రీడ. పర్యాటకంపై ఆసక్తి, క్లైంబర్స్, ఇతర సాహసకారులు ఇందులో విరివిగా పాల్గొంటారు. బ్రెజిల్‌లోని వర్షారణ్య ప్రాంతంలో ప్రతీ ఏటా అక్టోబర్‌లో ఈ జంగిల్ మారథాన్‌ను నిర్వహిస్తారు. ఏడు రోజుల్లో 200 కిలోమీటర్లు నాలుగు దశల్లో చలి, ఎండ, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మారథాన్‌లో పోటీదారులు పాల్గొనాలి. రాత్రి నివాసాలు ఏర్పరచుకుని విశ్రాంతి తీసుకోవచ్చు. రేసులోనూ పాల్గొనవచ్చు. మారథాన్ రూట్‌ను వివిధ కలర్లు, వివిధ సూచనలు తెలుపుతూ నిర్వాహకులు నిర్దేశిస్తారు. అయితే ఇన్ని రోజులు ప్రయాణించగలిగిన ఫిటెనెస్‌ను కలిగి ఉండాలి. ఈ ఏడాది అక్టోబర్ 5 నుంచి బ్రెజిల్‌లో జంగిల్ మారథాన్ నిర్వహించనున్నారు. ఈ సారి 127 కిలోమీటర్లు, 254 కిలో మీటర్లు మారథాన్ నిర్వహించనున్నారు.

సైకిల్ బాల్..

జర్మనీలో ఈ క్రీడను రాడ్‌బాల్‌గా పిలుస్తారు. ఇది ఫుట్‌బాల్‌ను పోలి ఉంటుంది. ఇద్దరు ఆటగాళ్లు చొప్పున టీమ్‌లో ఉంటూ బ్రేక్‌ల్లేని ఫిక్స్‌డ్ గేర్ సైకిల్‌తో ఫుట్‌బాల్‌ను గోల్ పోస్ట్‌లోకి నెట్టాల్సి ఉంటుంది. సైకిల్ లైదా బైక్ నుంచి బాల్‌ను తలతో డిఫెన్స్ చేసే వరకు అనుమతి ఉంది. అయితే గోల్ మాత్రం వీల్‌తోనే చేయాల్సి ఉంటుంది. 1893లో జర్మన్-అమెరికన్ జంట నికోలస్-ఎడ్వర్డ్ కఫ్‌మన్ ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ను మాత్రం 1929లోనే నిర్వహించారు. ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చెక్ రిపబ్లిక్, డెన్మార్క్, స్విట్జర్లాండ్‌లో విరివిగా ఆడుతుంటారు.



కాలి వేళ్లతో ఫైటింగ్

ఇది వ్యక్తుల కాలివేళ్లకు బలమైన పరీక్ష. అంతర్జాతీయ స్థాయిలో 'ఫీట్ రెజ్లింగ్' పోటీలను తొలిసారిగా 1976లో గ్రేట్ బ్రిటన్‌లోని డెర్బీషైర్ పబ్‌లో నిర్వహించారు. ఇది సరదాగా ఉండే ప్రమాదకర ఆట. ఇందులో ఫలితం ఎలా ఉన్నా వేళ్లు విరిగిపోవడం, నరాలు తెగిపోయే ప్రమాదం ఉంది. 1997లో ఆర్గనైజర్లు ఈ పోటలను ఒలింపిక్స్ క్రీడల్లో చేర్చాలని కూడా కోరడం గమనార్హం. పాదాన్ని పక్కకు తిప్పుతూ కాలి బొటన వేలిని నేలకు తగిలించిన వారే విజేతగా నిలుస్తారు.

విజిలేస్తే..

ఒక్క విజిల్‌తో మానసిక ఆనందాన్ని పొందు తుంటాం. ఈ ప్రత్యేకత వల్లే ఈల పోటీలను ఐర్లాండ్‌లోని నిర్వాహకులు మొదలెట్టారు. 2009లో ఇర్విన్‌స్టన్ అనే చిన్న పట్టణంలో తొలి ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించారు. మహిళలు, పురుషులు అనే భేదం లేకుండా ఎవరైతే విజిల్‌తో అదరగొడతారో వారికి భారీ బహుమతి ఇస్తారు.

గుడ్డుతో కొడితే...

ఇది అసలైన గమ్మత్తు పోటీ. 2006 నుంచి సూడాన్, గ్రేట్ బ్రిటన్‌ల్లో ప్రతీ ఏటా నాలుగు విభాగాల్లో గుడ్లు విసిరే పోటీలను నిర్వహిస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోటీలు జరుగుతుంటాయి. ఆస్ట్రిచ్ పక్షులతో రేసుల్లో పాల్గొనడం, నీటి అడుగున హాకీ ఆడటం ఇలా మరెన్నో వెరైటీ ఆటలెన్నో ఉన్నాయి. ఇవన్నీ వింటే మనం ఏముందిలే అని చూసే 'స్వాన్ అండ్ లెమన్' కూడా చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది కదా.

ఏ ఆట గొప్పదనం ఆ ఆటదే. అంతెందుకు మనం తెగ హుషారుగా ఆడే 'మ్యూజికల్ చైర్స్'కు అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని మీకు తెలుసా..! ఏ ఆటైనా సరదా పుట్టిస్తే దానికి అర్థపర్థం ఉన్నట్టే. ఇలాంటి సరదా ఆటల్ని మరిన్ని కనిపెట్టేసి ఆడేసేయండి. ఎంతసేపు కప్పులు, ట్రోఫీలు తలనొప్పులేనా. నలుగురూ కలిసిమెలిసి నవ్వులు, కేరింతలతో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా మజా చేసే గమ్మత్తు ఆటలకూ కొంచెం చోటివ్వండి గురూ. ★

ఎత్తు చెప్పులతో...

హైహీల్స్ వేసుకుని పరుగు అందుకోవడమనేది బలమైన పోటీయనే చెప్పాలి. మాస్కోతో పాటు సిడ్నీ, ప్యారిస్, ఆమ్‌స్టర్‌డమ్‌ల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు. సుమారు 300 మంది పోటీదారులు ఇందులో పాల్గొంటారు. 80 మీటర్ల దూరాన్ని పరుగు పెట్టాల్సి ఉంటుంది. పోటీదారులు ధరించే హీల్స్‌కు కొలతలు, కొన్ని ప్రమాణాలున్నాయి. హీల్ 7 నుంచి 1.5 సెంటీ మీటర్ల మందం తక్కువగా ఉండకూడదు.



ఆకలేస్తే కరెంట్ తింటా..!

కరెంట్ వైర్ ఒట్టిగా కనిపిస్తే చాలు షాక్ తింటారు కొంతమంది. కానీ మనోడు కరెంట్‌నే తినేస్తానని వైర్‌ను పట్టుకుంటాడు. ఇంతకీ విషయమేమంటే ముజఫర్ నగర్‌కు చెందిన నరేష్‌కు సాధారణంగా షాక్ కొట్టదు. హై వోల్టేజీని కూడా అతడి శరీరం తట్టుకుంటుంది. ఈ విషయం కూడా అకస్మాతుగా తెలిసిందితడికి. ఏదో పనిచేస్తూ చూడకుండా కరెంట్ వైర్‌ను పట్టుకున్నాడు. అప్పుడది షాక్ కొట్టలేదు. కరెంట్ లేదనుకోడానికి లేదు. ఆ వైర్ పక్కనే బల్బ్‌ను ఎంచక్కా వెలిగిస్తోంది. అరే! ఇదేంటి అనుకుని మరో తీగను పట్టుకున్నాడు. అది కూడా షాక్ కొట్టలేదు. అలా టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు ఇలా దేని వైర్‌నైనా ఒట్టి చేతులతో పట్టుకుని తన పరిధి తెలుసుకున్నాడు. ఆ తర్వాత కరెంట్ వైర్‌ను ఓ అర్ధగంట పాటు పట్టుకుంటే ఆకలి తీరిన అనుభూతి కూడా కలిగింది. ఇక అప్పటి నుంచి ఆకలి వేసినప్పుడల్లా వైర్ పట్టుకుని స్విచ్ వేసుకోవడం మొదలెట్టాడు. ఇలా కరెంట్ షాక్ కొట్టని మనుషులు ఇంకొందరు ఉన్నారు. వారిలో మన దేశానికే చెందిన 'ఎలక్ట్రోమేన్' రాజ్ మోహన్ నాయర్, 'హ్యూమన్ బ్యాటరీ' స్లావీసా పాజ్కిక్ కరెంట్‌తో సాహసాలు చేస్తుంటారు. కానీ వీళ్లెవరూ కరెంట్‌ను తింటామని చెప్పరు. నరేష్ తన ఒంట్లో 80 శాతం విద్యుత్తే నిండి ఉంటుందని భ్రమ



పడుతుంటాడు. కరెంట్‌ను కాసేపు ముట్టుకుంటే ఆకలి తీరుతుందని అనుకుంటాడు. ఇంట్లో ఎప్పటికప్పుడూ తనకు కిక్కు ఇచ్చేందుకు కొన్ని వైర్లను అలా ఒట్టిగా వదిలేశాడు. బుద్ధి తోచినప్పుడల్లా వాటిని ముట్టుకుంటాడు. కానీ ఇంట్లో అతడి భార్యాపిల్లలు మాత్రం తెగ భయపడుతున్నారు. ఆయనకంటే షాక్ కొట్టదు కానీ మా పరిస్థితి అలా కాదని జాగ్రత్తగా తిరుగుతుంటారు.

ఆఫీసులో హెల్మెట్



రోడ్డు మీదే హెల్మెట్‌తో తిరగడం కష్టం. ఇక ఆఫీసులో కూడానా! అయినా ఎందుకు అంటే? పెచ్చులూడి బుర్ర పగిలి రంగు పడుద్దని. బీహార్‌లోని అరెరాజ్ ఊళ్లో ఉన్న ప్రభుత్వ భవనంలో పనిచేసేవారి పరిస్థితి ఇది. రెండేళ్ల క్రితమే భవనం శిథిలావస్థకు చేరిందని ఆఫీసు మార్చుకోమని సేఫ్టీ ఇన్‌స్పెక్టర్‌లు చెప్పి వెళ్లారు. కానీ కొత్త భవనం గురించి పైఅధికారుల నుంచి స్పందన రాలేదట. చేసేదిలేక ఆ భవనంలోనే భయం భయంగా విధులు నిర్వరిస్తున్నారు ఉద్యోగులు. ఈ వర్షాలకు నీరు కప్పులోకి చేరి పెచ్చులు రాలడం మొదలైంది. కొందరి తలకు దెబ్బలు తగిలేసరికి ఇలా హెల్మెట్ పెట్టుకుని పనిచేయడం మొదలెట్టారు. ఎవరు తీశారో గానీ వీరి పరిస్థితిని ఓ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టేశారు. అంతే ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. ఆఫీసు త్వరగా వేరే చోటకు మార్చుకోమనే కాదు ఆ వీడియోలో ఉన్న నలుగురు ఉద్యోగులకూ షోకాజ్ నోటీసులు పంపించారు. ఏదన్నా ఉంటే మాతో మాట్లాడాలి కానీ ఇలా పబ్లిక్ అయితే ఎలా అనేది వాళ్ల ఉద్దేశమేమో.

వింత లోకం

ఇన్‌స్టా నెరపు!



ఎవరన్నా వయస్సు తగ్గినట్టు కనిపించాలని తెగ ఆప సోపాలు పడుతుంటారు. కానీ పోలెండ్‌కు చెందిన పావెల్ లాడ్జియాక్ అలా కాదు. 60లు దాటిన వాడిలా తెల్ల రంగేసుకుని తిరుగుతున్నాడు. ఎందుకంటే అలా ఉంటేనే అందరూ 'పోలిష్ వైకింగ్' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో తెగ లైక్ చేస్తున్నారట. తొలుత తన అస్సలు వయస్సులోనే ఫొటోలు దిగి పెట్టేవాడు కానీ ఎవరూ పట్టించుకోలేదు. ఆ తర్వాత జిమ్‌కెళ్లి మాంచి కసరత్తులు గట్రా చేసి బిల్డర్‌గా మారాడు. అయినా స్పందన అంతంత మాత్రమే. కానీ ఓసారి గెడ్డం పెంచేసి తెల్ల రంగేసుకుని ఫొటో పెడితే ఒక్కసారిగా సెలబ్రెటీ స్థాయికెళ్లిపోయాడు. 'అరే! 60 ఏళ్ల మనిషి ఎంత దృఢంగా ఉన్నాడు..' 'తాత రాయిలా ఉన్నాడే' అని ఫాలోవర్లు కామెంట్‌లు పెట్టడమే కాదు.. అభిమానులుగా మారిపోయారు. ఇక అప్పటి నుంచి ఆ స్టార్‌డమ్ వదులుకోలేక అలానే యంగ్ వృద్ధుడిలా కండలు పెంచి తన ఫొటోలు పెట్టేస్తున్నాడు. నిజానికి పావెల్ వయస్సు 35 ఏళ్లు. కానీ 60 ఏళ్ల వయస్సువాడిలా తల నెరిపించుకున్నాడు. ప్రస్తుతం మూడు లక్షల ముప్పై వేల మందికి పైగానే ఫాలోవర్లను సంపాదించుకున్న పావెల్ ఇన్‌స్టా నెరపు ఇప్పుడు అక్కడో కొత్త స్టైల్. తాత ట్రెండ్ సెట్ చేశాడు.



బానిస బతుకులు

• వ్యవసాయం, తయారీ రంగం చేపల పెంపకం, మైనింగ్ వంటి వాటితోపాటు విదేశీ పరిశ్రమల్లో పని చేసే చాలామంది ఇప్పటికీ బానిసలుగా బతుకుతున్నారు. ఇలాంటి వృత్తుల్లో వున్న ప్రతి ఐదుగురిలో ఒకరు లైంగిక వేధింపులకి గురవుతున్నారనేది ఓ అధ్యనంలో తేలింది.

• ఇటీవలి నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా వున్న బానిసల సంఖ్య 4.5 కోట్లు.

• ఐర్లాండ్ మొత్తం జనభా కంటే బానిసల సంఖ్య ఐదు రెట్లు ఎక్కువ.

• సాధారణంగా ఆఫ్రికా ఎక్కువ బానిసలున్న దేశం అనేది ఒక అపోహ మాత్రమే.... ఇక్కడి నుండి పని కోసం తీసుకెళ్ళే దేశాలు వీరిని బానిసలుగా తయారు చేస్తున్నారు.

• ప్రపంచ వ్యాప్తంగా బానిసలుగా వున్న మహిళల సంఖ్య వారిలో 55 శాతం.

• బానిస వర్తకం (స్లేవ్ ట్రేడ్) ద్వారా ప్రాణాలు కోల్పోయిన బానిసల జ్ఞాపకార్థం ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ఆగస్టు 23న ప్రత్యేక దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

• బానిసలపై చట్టపరమైన హక్కుని పొందిన దేశం అమెరికా. అమెరికాలో పొగాకు సాగులో పనిచేసిన ఆంటోని జాన్సన్ మొట్టమొదట చట్టపరమైన బానిస.

• స్లేవ్ అనే పదం తూర్పు ఐరోపాలోని స్లావోనిక్ జనాభా నుండి వచ్చింది, వీరంతా మధ్య యుగంలో బానిసలుగా ఉన్నారు.

• బ్రిటన్‌లో బానిసత్వం రద్దు చేయబడినప్పుడు 46 వేల మంది బానిస యజమానులకి ఆ దేశం డబ్బు చెల్లించింది.

• 1526 నుండి 1867 మధ్య ఆఫ్రికా నుండి అమెరికాలకు రవాణా చేసేందుకు తరలించిన బానిసలు కోటి పాతిక లక్షల మంది. అమెరికాకు చేరే సరికి ప్రాణాలో వున్నది కోటి ఏడు లక్షల మంది.



• నిర్బంధిత కార్మికులు, మానవ అక్రమ రవాణాతో సహా ప్రపంచం మొత్తంలో ప్రతి నెలా సుమారు 30,000 మంది బానిసలుగా మారుతున్నారు.

• మానవ అక్రమ రవాణా, నిర్బంధిత కార్మికులను బహిష్కరించడం లాంటివి ఆధునిక బానిసత్వ చట్టం 2015 లో మాత్రమే ఆమోదించబడ్డాయి.

• ఆధునిక బానిసత్వ చట్టం నివేదిక ప్రకారం ప్రస్తుతం తీవ్ర బానిసత్వంలో మగ్గుతోంది 58 శాతం మంది. వీరంతా భారత్, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్థాన్ ఈ ఐదు దేశాలకి చెందినవారనేది ఓ నివేదిక.

• ఒక వ్యక్తి బెదిరింపులు, హింస, అతని పై చట్టపరమైన అధికారం, దుర్వినియోగం లాంటివి ఆధినిక బానిసత్వం సూచించే అంశాలు.



• బానిస వాణిజ్యం ద్వారా అధిక లాభాలని గడించే నేపథ్యంతో 1802లో 'వెస్ట్ ఇండియన్ డాక్స్'.... లండన్‌లో మూడు ఓడ రేవులుగా నిర్మించబడ్డాయి.

• గ్లోబల్ స్లేవరి ఇండెక్స్ అంచనా ప్రకారం భారత్ లో వున్న బానిసల సంఖ్య సుమారు కోటిన్నర మంది.

• ప్రపంచ వ్యాప్తంగా 26 శాతం బానిసలు 18 సంవత్సరాల లోపు వారే.



నీడలల జాడ

కొన్ని కథలు నల్లేరు మీద నడకలా సాగిపోతాయి. మరికొన్ని రిస్కుతో కూడుకున్నవి వుంటాయి. చాలా సాహసం చెయ్యాలి. కథ జనబాహుళ్యానికి నచ్చాలి. ఇప్పటిలా ఏదో వర్గాన్ని టార్గెట్ చేసుకుని చిత్రాలు నిర్మించడం కాదు. అప్పట్లో సినిమా అందరు ప్రేక్షకులకూ నచ్చాలి. నేల మీద కూర్చొని సినిమా చూసే ప్రేక్షకుడికి సైతం సినిమా కనెక్ట్ కావాలి. అప్పుడే ఆ చిత్రం విజయం సాధించినట్టు! లేకపోతే సమయం వృథా... అగ్ర నటీనటుల కాల్షీట్లు, డబ్బు అన్నీ వృథా అవుతాయి. ముఖ్యంగా సంస్థ ప్రతిష్ట దెబ్బతింటుంది. 'వెలుగు నీడలు' చిత్రం గురించి డైరెక్టర్ దగ్గర్నుంచి ప్రధాన నటీనటులు, సాంకేతిక వర్గమంతా అలాగే అనుకున్నారు. అయితే బయటికి చెప్పలేదు. దుక్కిపాటి వారికి ఎదురుచెప్పడం అక్కినేనికే చేతనయ్యేది కాదు. అయినా అక్కినేనికి ఆయన మీద అపార నమ్మకం! మధుసూదననరావుగారు ఏం చేసినా తన మంచికే చేస్తారు. ఆయన ఆలోచనలూ, నిర్ణయాలూ తిరుగులేనివి. అందువల్ల సినిమా గురించి పిచ్చి పిచ్చిగా ఆలోచించడం అది తెలిసి పెద్దాయన దుక్కిపాటి బాధపడటం అర్థరహితం అంటూ తేల్చిపారేశారు. దుక్కిపాటి, ఆస్థానకవి ఆత్రేయ, దర్శకుడు ఆదుర్తి కథపై కూర్చున్నారు. చాలా కసరత్తు చేశారు. ఆత్రేయ గారికి నమ్మకం కుదిరింది. 'జీవితమంటే వెలుగునీడలే. ప్రకృతిలో కూడా చీకటి వెలుగులే కదా. ఇంతగొప్ప సత్యాన్ని కథలో ఇముడ్చుకొని ఆలోచించడం దేనికి?' అంటూ సంభాషణలు మొదలుపెట్టారు. నటీనటులు సావిత్రి, నాగేశ్వరరావు, యస్వీ రంగారావు, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, సూర్యకాంతం, గిరిజ ప్రధాన పాత్రధారులు. ఇంకేం ... అక్కినేని, సావిత్రికి సంభాషణలు రాయడమంటే ఆశువుగా పుట్టుకొచ్చేవి. ఆపై జగ్గయ్య, యస్వీ. రంగారావు, సూర్యకాంతం గిరిజ ఒక్కొక్కరూ ఉద్దండులే. వారి పాత్రలకీ ఔచిత్యానికి సరిపడే సంభాషణలు తయారయ్యాయి. ట్రీట్‌మెంట్ బాగా వచ్చిందనుకున్నవారికి స్క్రిప్ట్ డైలాగ్ పార్టు కూడా ఇంకా బాగా వచ్చేసరికి యూనిట్ సభ్యులందరి ముఖాల్లోనూ చిరునవ్వు చోటు చేసుకుంది. 'వెలుగునీడలు' చిత్రం బౌండ్‌స్క్రిప్ట్ దుక్కిపాటి వారి చేతిలో వుంది.

పాటలన్నీ వెలుగుపూలు

'వెలుగునీడలు' చిత్రంలో పాటలన్నీ వెలుగుపూలే! అప్పటికి సంభాషణలతో ఆత్రేయగారు అలసిపోయారు. పాటలు రాయడానికి సమయం కావాలి. సినిమా నిర్మాణం మొదలుపెట్టిన తర్వాత ప్రతి నిముషమూ విలువైనదే. రెస్టు కావాలంటే సినిమా రిలీజయిన తర్వాత రెస్టు తీసుకుందామనుకున్నారు. ఆత్రేయ గారు వస్తానంటారు రారు. అది మనకి తెలిసిందే కదా. భావుకుడు, పాత్రికేయుడు, అభ్యుదయ భావాలు కలవాడు శ్రీశ్రీ గార్ని పిలిచారు. 'మనమంటే ఆయనకు చాలా ప్రేమ. ఆయన మనసుపెట్టి రాస్తే తిరుగేముంది?' అంటూ శ్రీశ్రీ గార్ని పిలిపించి ఆదుర్తి వారితో సిట్టింగ్ ఏర్పాటు చేశారు. హీరో అభ్యుదయ వాది అని చెప్పడానికి సంస్కరణాభిలాషతో కూడిన పాట కావాలి. శ్రీశ్రీ కలాన్ని ఝళిపించారు.

"పాడవోయి భారతీయుడా! ఆడి పాడవోయి విజయగీతికా" సందర్భాన్ని మించిన స్థాయి పాట. ఈనాటి పరిస్థితులకూ అద్దం పట్టే....పాట. "పదవీ వ్యామోహాలూ – కులమతబేదాలూ భాషాద్వేషాలూ – చెలరేగే నేడు ప్రతిమనిషీ మరిఒకరిని దోచుకొనేవాడే.....

తన సౌఖ్యం తన స్వార్థం చూసుకొనేవాడే...." ఈనాటి రాజకీయ ముఖచిత్రంగా నిలిచే పాట ఇది. ఇక పెండ్యాల వారు వూరుకుంటారా ఆ పాటకి ప్రాణం పోశారు. మధుసూదనరావుగారి ప్రతిసినిమాలో ఓ సందేశ గీతం వుంటుంది ఈ పాట వార్షికోత్సవ సందర్భంతో వుంటుంది గనుక పేరున్న కళాకారిణి చేత చేయించాలనుకున్నారు. 'రాజసులోచన' ఈ గీతంలో కనిపిస్తుంది.

ఇంకోపాట ప్రేయసీ ప్రియుల మధ్య భావ సారూప్యత కోసం..అందులోనూ అభ్యుదయ భావాలు జోడించి రాసిన పాట 'ఓ రంగయ్యో..పూలరంగయ్యో.. వాలు చూపు చాలించి సాగిపోవయో.....పొద్దువాలిపోతున్నదోయూ.. ఇంత మొద్దు నడక నీకెందుకోయూ' అంటూ సాగిన ఈ పాటలో శ్రీశ్రీ మార్కు కనిపిస్తుంది.

అన్నపూర్ణా పిక్చర్స్ అధినేత మధుసూదనరావు అభిరుచిగల నిర్మా
నిర్మాణాన్ని చిత్త శుద్ధితో చేపట్టిన వ్యక్తి! ఆయన నిర్మించిన చిత్రాలు స
సమస్యలకు అద్దం పడుతుంటాయి. నిత్యనూతనంగా వుంటాయి. స
చెప్పడంలోనే కాదు ఆ సమస్యకి అందమైన పరిష్కారం చూపించడం
అందెవేసిన చెయ్యి! 'వెలుగునీడలు' చిత్రం అందుకు నిలువెత్తు నిదర్శ
తయారీలో నవరసాల్ని మేళవించి అందులో చెప్పదలచుకున్న విషయ
చెప్పగల నిర్మాత ఆయన. అలా ఒక అద్భుతమైన సమకాలీన సామాజి
తీర్చిదిద్దిన చిత్రం 'వెలుగునీడలు'. ఇలాంటి కథని ఎంపిక చేసుకొని జ
తీర్చిదిద్దిన ఘనత దుక్కిపాటివారికే చెందుతుంది!



. సినిమా
ుకాలీన
స్యని ఎలుగెత్తి
లో ఆయన
ం! ఒక సినిమా
న్ని బలంగా
దృశ్యంగా
రంజకంగా



"పగలనక.. రేయనక.. పడుతున్నా శ్రమలనక పరుల కోసం ధారపోయు మూగజీవులు ఆటలలో పాటలలో..ఆయాసం మరచిపోయి
ఆనందం కలుగజేయు ధన్యజీవులు" ఇలా సాగుతుందీ పాట. మూడవది ముఖ్యమైన పాట. ఎందరి జీవితాలకో స్ఫూర్తిదాయకంగా నిలిచిన పాట "కలకానిది విలువైనది... బ్రతుకు కన్నీటి ధారలతోనే బలిచేయకు!" అంటూ పల్లవితో
మొదలైన ఈ పాట "అగాధమౌ జలనిధిలోన..ఆణిముత్యమున్నటులే... శోకాల మడుగున దాగి..సుఖమున్నదిలే"
ఏదీ తనంత తానై.. నీదరికి రాదు శోధించి సాధించాలి అదియే ధీర గుణం!" ఎంత గొప్ప అర్థవంతమైన మాటల్ని పాటలో పొదిగాడు శ్రీశ్రీ. ఈ పాటకి స్వరం చేస్తున్నప్పుడు చలించిపోయిన పెండ్యాల ఈ పాట రికార్డింగ్ చేస్తున్నట్లు కనిపిస్తారు. సహాయకుడు ఏ.ఏ.రాజ్ కూడా వాయులీనం వాయిస్తూ కనిపిస్తాడు. ఎందరో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నవాళ్ళ ఆగిపోయారు. అందులో భీమరాజు ఒకడు (పాతనటుడు). తర్వాత ఒక ప్రణయ గీతం 'హాయి..హాయిగా జాబిల్లి... తొలిరేయి వెండిదారాలల్లి... మందు చల్లి నవ్వసాగే ఎందుకో..మత్తు మందు చల్లి నవ్వసాగే ఎందుకో..." ఈ పాటని అక్కినేని గిరిజలపై చిత్రీకరించారు. అక్కినేని సరసన కథానాయికగా నటించింది గిరిజ.
ద్వితీయార్థంలో మరోపాట "చిట్టిపొట్టి పొన్నారి పుట్టినరోజు చేరి మనం ఆడేపాడే పండుగరోజు, చల్లని వెన్నెల సోనలు తెల్లని మల్లెల మాలలు మా పాపాయి బోసినవ్వులే మంచి ముత్యముల వానలు." ఈ పాటలు కూడా శ్రీశ్రీ రాశారంటే ఆశ్చర్యం కాదు. కానీ ఆయనే రాశారు. సినిమా కథ సంభాషణలూ ఎంత బాగా వచ్చాయో.. పాటలు అంతకు మించి వచ్చాయి. అందుకే సినిమా అంత హిట్ అయ్యింది.

క్లిష్టమైన కథ

రావు బహదూర్ యస్వీ రంగారావు. అతని భార్య కనక దుర్గమ్మ సూర్యాకాంతం. వీళ్ళకి పిల్లలుండరు. (సావిత్రి) సుగుణని పెంచుకుంటారు. ఆ తర్వాత గిరిజ పుడుతుంది. సూర్యాకాంతానికి సావిత్రిపై వెగటు పుడుతుంది. ఇది గమనించిన యస్వీఆర్..సుగుణ (సావిత్రి) బాధ్యతని రేలంగికి అప్పగిస్తాడు. డాక్టరు చదువుతున్న సుగుణ (సావిత్రి)కి కవితలు రాసే రవి(అక్కినేని)తో పరిచయమవుతుంది. అది ప్రేమగా మారుతుంది. (అక్కినేని సావిత్రిల మధ్య) విదేశాల్నుంచి వచ్చిన రఘు (జగ్గయ్య) సుగుణపై ప్రేమ చూపిస్తాడు. రవికి క్షయ వస్తుంది. సుగుణ సుఖం కోరుకున్న రవి జగ్గయ్యతో పెళ్ళికి ఒప్పిస్తాడు. రఘు ప్రమాదంలో మరణిస్తాడు. రవి(అక్కినేని) మదనపల్లి శానిటోరియంలో వుండి ట్రీట్‌మెంటు తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడు. సావిత్రి గిరిజ (వరలక్ష్మి)ను పెళ్ళి చేసుకోమనటంతో ఆమెని పెళ్ళి చేసుకుంటాడు. రావు బహదూర్ 'రాజసేవ' పత్రికను నష్టాల్లో నడిపిస్తూ వుంటాడు. రవి స్వతహాగా భావుకుడు, మేధావి. అతను పత్రిక బాధ్యతని తీసుకుని దానిపేరు మార్చి 'నవజ్యోతి'గా తీర్చిదిద్ది లాభాల పంట పండిస్తాడు. ప్రెస్‌లాభాల్లో నడుస్తున్నందుకు అందుకు సహకరించిన వారందరికీ సమభాగం ఇవ్వాలంటాడు రవి. అప్పటికే ఆ డబ్బు కనక దుర్గమ్మ పిల్లలు ఖర్చు పెట్టేస్తారు. సవతి కూతురు సావిత్రి వచ్చి పోతుండటం రవితో సన్నిహితంగా వుండటం గమనించి నిందలువేస్తారు. ఎవరికి వారిది నిస్వార్థమైన ప్రేమ అని తెలుసుకొని పశ్చాత్తాప పడతారు. కథ ఎక్కడా బిగువు తగ్గదు. జీవితంలో వెలుగు నీడలు వుంటాయని, వాటిని ధీరోదత్తంగా ఎదుర్కోవాలని హితవు చెప్పే ఈ చిత్రంలో ప్రతి సన్నివేశాన్ని చక్కగా పండించారు. ఇప్పటికీ ఈ చిత్రం చాలా మంది కళ్ళలో మెదులుతుంటుంది.

అక్కినేని - సావిత్రి నటన

ఇప్పుటిలా నటుల బాడీలాంగ్వేజీకి తగ్గట్టు కథలు రాయడం అప్పట్నించే ప్రారంభమయ్యింది. రవి పాత్రలో అక్కినేని, సుగుణగా సావిత్రి, జగ్గయ్య జీవించారు. మిగతా పాత్రలన్నీ ఉద్దండులు చేశారు. యస్వీఆర్, జగ్గయ్య, సూర్యకాంతం, గిరిజ, రేలంగిల నటన గురించి ప్రత్యేకించి చెప్పవలసిందేముంటుంది? అక్కినేని సావిత్రి పాత్రల్లో డైమెన్షన్ వుంది. గొప్ప ప్రేమికులుగా కనిపిస్తారు. గొప్ప భావుకులుగా అనిపిస్తారు. చివరికి త్యాగమూర్తులుగా నిలుస్తారు. వీరిద్దరి పాత్రల మధ్య వెలుగు, నీడలే ఈ చిత్రకథాంశం. కథని అక్కినేని సావిత్రి తమ చుట్టూ తిప్పుకుని ప్రేక్షకుల్ని సమ్మోహనంలో పడేసి చిత్రానికి అఖండ విజయం చేకూర్చారు.

ఓ డిఫరెంట్ డైరెక్టర్

సాంఘిక చిత్రాల విసయానికొస్తే ఎల్వీ ప్రసాద్, కె.యస్ ప్రకాశ్‌రావు, తాతినేని ప్రకాశరావు తర్వాత ఓ డిఫరెంట్ ఆదుర్తి! స్వతహాగా ఎడిటరు గనుక ఎక్కడా సింగిల్ ఫ్రేము కూడా వృధాగా అనిపించదు. ఆదుర్తి ట్రీట్‌మెంటు స్పూన్ ఫీడింగ్‌లా వుంటుంది. కథ సెల్యూలాయిడ్ మీదా మలచడంలో ఎక్కడా ఏ విధమైన కన్‌ఫ్యూజన్ వుండదు. ముఖ్యంగా మెలోడ్రామా సన్నివేశాల్ని పండిచడంలో ఆదుర్తి తర్వాతే ఎవరైనా. ఈయనలో గొప్పతనం డ్రామా ఎంత బాగా పండించగలడో.. హాస్యరసాన్ని అంతే బాగా తెప్పించగలడు. అందుకే ఆదుర్తి చిత్రాలన్నీ ఆణిముత్యాలుగా నిలుస్తాయి. అందులో ఓ మేలిముత్యం వెలుగునీడలు!

- ఇమంది రామారావు

9010133844

ముసురు

ఊరు ఊరంతా
విచ్చుకోని తామర మొగ్గలాగుంది
మండని పొయ్యిపై
కాగని నీళ్ల డేగిస
కట్టేసిన పంది పిల్లలాగుంది
దూళ్లపాక పశువుల చిత్తడిలో
కాలు వేస్తే జారుడు బండైపోతోంది
గొంగళి కప్పుకుని
గొంతుక్కూర్చున్న రైతు చూపు
వానలో దిగడి నీరుగారి పోతోంది
నీరు దిగేసే వానని
నీరు దిగని చేనుని
తలలెత్తిన మబ్బుల్ని
తలవాల్చిన కంకుల్ని తలచుకుంటూ
సుదినం కాదని జావకతకని కళ్లు
ఆకాశానికి దుర్భిణి వేస్తున్నాయి
నీళ్లలోంచి నిప్పుని వెతుకుతూ
మబ్బుల్ని కంటి కొసన నెడుతూ
శ్వాసని నీరసంగా గురిపెడుతూ
ఓ వెలుతురు పిట్టా!
వేసవంతా నీ బాహువుల గాడ్పుల్లో మాడినా
నీ రెక్కలు వీచే
వెచ్చని ప్రాణ స్పర్శ కోసం అల్లల్లాడేలా
ఈ అకాలపు ముసురు

- నారాయణమూర్తి తాతా
9298004001

కవిత్వం

నా పల్లె



మట్టిపూలను శిఖలో తురుముకుని
తెలిమంచు పైట సవరించుకుని
పచ్చా పచ్చని చీరలో
నా పల్లె.. రేపల్లె ముస్తాబౌతుంటే
ఎక్కడ నుంచి వచ్చాయో! ఆ అందాలు
చూడముచ్చటగా వున్నాయి
వేకువ కోడి కూతలు
తొలి సంధ్య వెలుగులో
గోధూళి మేఘమాలలు
తొలిపొద్దు పొడుపులో
కొండ కోనల ముస్తాబులు
కోకిల కూత... కాకి అరుపులు
పక్షుల కిలకిలరావాలు
లచ్చుమమ్మ వేసిన ముగ్గులు
పైరుగాలి పల్లె గాలి
అదో అద్భుత దృశ్యం
రవివర్మకో... కవిరాజుకో
అందీఅందని ఆ అందాల రాశులు
నా పల్లె.. రేపల్లె
మళ్లీ ముస్తాబౌతోంది
గ్లోబలైజేషన్ దుసంస్కృతి
చెత్తా చెదారాలను దులుపుకుంటూ.. హాయిగా...!

- మీగడ వీరభద్రస్వామి
9441571505

కథ



కాటుక కరిగింది

కె. దేవికా రత్నాకర్

9908706218

"అమ్మా! ఎంత సేపలా ఏడుస్తావ్? కాస్త ముఖం కడుక్కుని ఈ మజ్జిగ తాగమ్మా!" చూడు అద్దంలో నీ ముఖం ఎలా వాడి పోయిందో!"

అద్దం కళ్ళ ముందుకు తెస్తూ ఎదురుగా ఇరవై రెండేళ్ల కొడుకు... మ్రాన్పడిపోయిన చూపులతో ... దిగాలుగా అయో మయం ముఖంతో..

మెల్లగా కనుపాపలను అద్దం వైపుకు త్రిప్పింది చిన్నారి తన కళ్ళను చూసుకున్న ఆమెకు ఒక్కసారిగా గతం అంతా కరిగిన కాటుక కళ్ళ అంచుల మధ్య రీళ్ళలా తిరిగింది.

"ఏవే చిన్నీ!! కాసింత కాసింత నెరిసిన ఆ జుట్టు దువ్వుకుని తలలో బంతిపువ్వు పెట్టుకుంటుంటే నీ బుగ్గలు ఆ పువ్వుని ఎక్కిరిత్తున్నట్టుండాదే" అంటూండగానే పెనిమిటి మాటలకు చిన్నగా నవ్వుకుంది చిన్నారి.

" అంటే నమ్మవుగాని అంతలేసి కళ్ళున్నాయి గోళీకాయల్లా 'పాప'ల్ని అట్టిట్టా తిప్పేత్తావు కానీ... నా కాడ కూకుని ఆట్టే కబుర్లు సెప్పకూడదంటే?!

"ఆ..ఆ.. గ్యాసు పొయ్యి మీద అన్నం మాడితే నీకు నచ్చుదయ్యోయ్. ఈ కబుర్లకేం గానీ... అన్నం, కూరలు మాడాలు...!! అయ్యగారి కైతలకపుడు అంతూపొంటూ ఉండదాయె!

సరేగానీ... అయ్యా! ఆ ఎకరం పొలం కౌలుకి తీసుకున్నాంగదా! ఈ ఏడన్నా మన పంట పండి అప్పు తీరి, మన పిల్లాడి డాక్టరీ ఫీజు ఇబ్బంది లేకుండా కట్టేత్తామంటావా?

"ఔనే చిన్నీ! ఈ యేడాది వాన దేవుడి కరుణా కటాచ్చాలన్నీ మన మీదనే మిణుకు మిణుకు మంటూ నారు మడి మీద వాన సినుకులు పడినట్టే పడీ.. పడీ.. పంట కోత కొచ్చినాది. ఈసారి కామందయ్యకు ఐన వడ్డీతో పిల్లాడి ఫీజు కట్టేత్తా. మిగతా డబ్బుతో నిన్ను పువ్వుల్లో పెట్టి సూసుకుంటానే"

'అయ్యో!! ఆ కామందు మాటెత్తమాక, నాక సిర్రెత్తి కొత్తది. ఆడి బట్టతల, బుర్ర మీసం, బొర్ర కడుపు అదేంటయ్యా!? అర్తె డెబ్బయ్యేల్లుంటాయి గదా. ఆనాపానా పెద్ద ముండా వాడయి గూడ ఎకిలి మాటలు.. వంకర నవ్వులు.. సందు దొరికినప్పుడల్లా ఒళ్ళూ ఒళ్ళూ రాసుకుంటుంటాడు. ఆడి పేరెత్తితే ఒళ్ళు మంట నాకు..."

"సరే గానీ, నీ కోసం.. కాదు, కాదు నా కోసమే.. ఏం తెచ్చానో చూసుకో... పెనిమిటి చేతి వంట ఆసక్తిగా చూసింది చిన్నారి. ఐనా కమ్మేసుకుంటూ...

" ఆ ఏదైతే ఏంటయ్యా!.. నాకు బంగారమంటి పెనిమిటి... వజ్రమంటి కొడుకుని ఇచ్చాడు దేవుడు ఇంకేమి కావాలి? నాకు పొలంలో బంగారం పండి నాలుగు రాళ్ళు ఎనకేసుకుని పిల్లాడి పెళ్ళిసేసి బంగారవంటి కోడల్ని తెచ్చుకోవాలి!"

"ఔనే! మా అమ్మని నువ్వు కళ్ళల్లో పెట్టుకుని సూసుకున్నావ్ గదా మరి నీ కోడలు నిన్ను అట్టా సూసుకుంటదంటావా?"

"ఎందుకు సూడదయ్యా! కట్నాలు, కానుకలంటూ ఆ పిల్ల దాని అమ్మ బాబుల ఉసురు పోసుకోకుండా ఆ పిల్లని ఆడపిల్లలా, మన పిల్లలా సూసుకుంటే ఆ పిల్ల మనల్ని సూసుకోదా"?

"సరేగాని ఈ పొట్లం ఇప్పి సూడే!" అంటూనే పొట్లం విప్పి చూపించాడు దేవయ్య

"ఐ...కాటుక!" ఎందుకయ్యా నాకిదిప్పుడు నేనేం పడుసు పిల్లనా? సోకులు నాకెందుకు?" అంటూనే సంతోషంగా అందుకుంది చిన్నారి. సంబరంగా అద్దం ముందుకెళ్ళి కళ్ళ చుట్టూ దిద్దుకుంది కాటుక.

అంతలో ఆకాశంలో తళుకుమంటూ మెరుపు. ఒక్కసారి అచ్చెరువుగా చూసింది భర్త వైపు. అతను ఆమె కళ్లను విస్మయంగా చూస్తున్నాడు.

"చిక్కని ఆకాశం మధ్య మెరిసే మెరుపులా ఎంత సోద్యంగా ఉన్నాయే నీ కళ్ళు! ఇదిగో! ఈ కాటుక నీ కళ్ళకు ఎప్పుడూ పెట్టుకోవాల. లేకపోతే నీ మీద ఒట్టే."

"ఏంటయ్యా! కళ్ళ కాటుకంటే నీకంతిష్టమా! ఎప్పుడో బడికెళ్ళే రోజుల్లో... అమ్మ రెండు జళ్ళకు

రిబ్బన్లు కట్టి ముఖానికి పౌడరద్దీ.. పక్కపిన్నుతో రెండు కళ్ళకి కాటుక తీర్చి "మాయమ్మ కళ్ళు బంగారం" అంటూ మురుసుకునేది. ఏళ్ళు గడిసే కొద్దీ కొంపలో శాకిరీ.. బయట శాకిరీతో ఈ సోకే మురిసిపోయా." అంది చిన్నారి.

"చిన్నీ! ఇప్పుడు మరీ ముద్దొచ్చేత్తున్నావే!! ఆ కాటుక కళ్ళకి తోడు నొసటన బొట్టు పెట్టుకో." అంటూ నవ్వుతూ బొట్టు బిళ్ళల ప్యాకెట్టు చేతికిచ్చాడు దేవయ్య.

"ఏంటయ్యోయ్! ఈ రోజు బలే ఉషారు మీదుండావు. ఏంటి కత?. అంటూ బలిష్టమైన చేతులతో వెడల్పాటి ఛాతీతో.. చాకిరీ చేసి చేసి బక్క చిక్కిన నడుముతో చూడచక్కని పెనిమిటిని లోలోపలే మురుసుకుంది చిన్నారి.

"ఏయే చిన్నీ! చీకట్లు కమ్ముతున్నాయే! నాకేంటో బయంగుండాది. కోత కొచ్చిన పంట



చేతికొచ్చిన కొడుకు తీర్చలేని అప్పు కామందుతో ముప్పు కళ్ళముందు మెదులుతుండాదే. ఈ ఏడు పంట చేతికొస్తే నీకు బొట్టూ కాటుకలేం కర్మ! పట్టు చీర, నగ నట్ర కొని రాణేలా సూసుకోవాలనుకున్నానే! ఈ వానిట్టా పడితే

మన దరిద్రమెట్టా తీరతాది పిల్లాడి చదువేం గావాలే "ఇదిగో! ఇప్పుడిప్పుడే సినుకు పెరుగుతుండె. కరెంటు పోతది. ఇప్పుడే దీపం వెలిగించు. "ఆ ఇదేం వానలేయ్యా! పూల జల్లులా నాలుగు అచ్చింతలు జల్లి... గాలి వాటానికి తేలిపోద్ది. నువ్వట్టే కంగారు పడబాక అంది భర్తని ఓదారుస్తూ. తనని కూడా దిగులు మేఘాలు కమ్ముతుండగా కరెంటు పోయింది.

"సర్లే నేను పొలం కాడికి పోయొస్త నా రాక ఆలీసమయితే తలుపేసుకు తొంగో. నువ్వు జాగ్రత్త" ఎందుకో భర్త మాటలు అశుభాన్ని సూచించాయి చిన్నారికి. చేసేదిలేక ఆగమేఘాల మీద వెళ్తున్న భర్తకేసి దిగులుగా చూస్తూ కూర్చుండి పోయింది చిన్నారి.

చినుకూ.. చినుకూ... మోపయ్యింది. ఉరుముల మెరుపుల ఫెళఫెళా రావాలతో ఆర్భాటంగా వాన కురుస్తోంది. హోరుగాలులకు ఇంటి పైకప్పులు ఊగుతున్నాయి. పూరింటి కప్పులు గాలిలో ఎగిరి పోతున్నాయి. చెట్ల కొమ్మలు జుట్లు విరబోసుకున్న దెయ్యాల్లా ఉధృతంగా ఊగుతున్నాయి. అక్కడక్కడా కరెంటు స్తంభాలు ఒంగి పడిపోతున్నాయి. ఎవరో చెప్పుకుంటున్నారు. సముద్రంలో అల్పపీడనమంట. మూడు రోజులు కుండపోత వానంట. తెల్లవార్లూ కళ్ళలో దీపం మలుగుతుండగా

నిర్వేదంగా తనలో తను నిట్టూర్చింది చిన్నారి చేతికొచ్చిన పంటని తనలో కలుపుకున్న వాన దేవుణ్ణి అనాలా? పర్వతమంత బంగారం తన భర్తను పొట్టన బెట్టుకున్న పురుగుల మందును తిట్టుకోవాలా? జీవితాంతం తోడు నడిచే పెనిమిటికి ఐదులచ్చల పరహారంతో వెలకట్టే పెద్దోళ్ళను తిట్టు కోవాలా? కన్నీళ్ళు ధారలు కడుతున్నాయి.

కంటికి కునుకు లేకుండా పలు ఆలోచనలతో భర్త రాక కోసం ఎదురు చూస్తూనే కూర్చుంది చిన్నారి.. పిడుగులాంటి వార్త చెవినపడేదాక.

పట్నం నుంచి కొడుకు వచ్చాడు. ఆమె ఊపిరి ఎవరో లాగేస్తున్నట్టు పెద్దగా అరవాలని గుడ్డలు చింపుకు ఎగరాలని జుట్టు పీక్కుని గట్టిగా ఏడ్వాలని అనిపిస్తోంది. ఏం చేయాలో తోచడంలేదు. కాళ్ళు చేతులు ఆడ్డం లేదు. దిక్కుతోచని స్థితిలో కూలబడి పోయింది. చిన్నారి. మాట పెగలడం లేదు. ఎవరెవరో పరామర్శిస్తున్నారు. ఓదారుస్తున్నారు. ఎవరో అంటున్నారు. తన భర్త పురుగుమందు తాగాడంటు... 'అట్టా సచ్చిపోయిన వాళ్ళకి పెబుత్వం డబ్బిలిత్తాదంట'. నిర్వేదంగా తనలో తను నిట్టూర్చింది చిన్నారి చేతికొచ్చిన పంటని తనలో కలుపుకున్న వాన దేవుణ్ణిలా? పర్వతమంత బంగారం తన భర్తను పొట్టన బెట్టుకున్న పురుగుల మందును తిట్టుకోవాలా? జీవితాంతం తోడు నడిచే పెనిమిటికి ఐదులచ్చల పరిహారంతో వెలకట్టే పెద్దోళ్ళను తిట్టుకోవాలా? కన్నీళ్ళు ధారలు కడుతున్నాయి. తలతిరుగుతున్నట్టునిపించింది. కాళ్ళు తేలిపోతున్నాయి. తను తూలిపడ పోతుందని తనకే తెలిసింది. కళ్ళూ ఒళ్ళూ కన్నీళ్ళై కొడుకు చెయ్యి పట్టుకుంది చిన్నారి. ★

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థి తుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com



మీరు బ్రోక్పా తెగ గురించి తెలుసుకోవాల్సిందే. ఎందుకంటే ఏకంగా 2,200 ఏళ్ళుగా శాఖాహారంతోనే బతికేస్తోంది ఈ తెగ. అయితే వాతావరణ మార్పుల ద్వారా ఈ తెగ ఆహారంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వీరి ఆహార అలవాట్లలో మార్పు మనకో విషయాన్ని స్పష్టం చేస్తుంది. అవసరం, లభ్యత, పరిస్థితులు, వాతావరణ ప్రభావాలు మన తిండి అలవాట్లను నిర్దేశిస్తాయి.

తిండి మారింది

మన ఆహారంలో నాన్‌వెజ్ కూడా ప్రధానం. ఇక అడవుల్లో జీవించే తెగల విషయానికి వస్తే మాంసాహారానిదే పెద్ద వాటా. కానీ పూర్తి శాఖాహారులుగా బ్రోక్పాలు వుండడం ప్రత్యేకం. అలా కొన్ని వేల సంవత్సరాలుగా మాంసాహారాన్ని రుచిచూడని ఈ తెగ ఇప్పటికీ మనుగడ సాగిస్తోంది. ఏంటి ఆశ్చర్యంగా వుందా అయితే లేహ్, లఢాక్ ప్రాంతాలకి వెళితే ఆ నిజాలేంటో మీరూ తెలుసుకోవచ్చు. జమ్మూ కాశ్మీర్ నుండి 163 కి.మీ. దూరంలో వుంది లేహ్. థ హను లేహ్‌లోని ఓ మారుమూల గ్రామం. అక్కడుండే పురాతన తెగల్లో దార్ద్ ఒకటి. బ్రోక్పా దార్ద్ ఉప తెగ. దియోసా పీఠ భూమికి అతి దగ్గరగా ఉండే ఉపతెగలతో పాటు బ్రోక్పకి చెందిన వాళ్ల ఇక్కడే నివాసం వుండేవారు.. కార్గిల్ యుద్ధం సమయంలో ఎంతో మంది బ్రోక్పాలు ఈ ప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్ళిపోవాల్సి వచ్చింది. అప్పుడు బిమా ప్రాంతంలో వీళ్ళు నివాసాలు ఏర్పరుచుకున్నారు. అప్పటి నుండి బ్రోక్పాని పూర్తిస్థాయిలో ఒక తెగగా పరిగణిస్తున్నారు. లేహ్‌లోని మరికొన్ని గ్రామాలు బీమా, గార్కొన్, థార్థిక్‌లో నివసిస్తున్న మరికొందరితో కలిపి ప్రస్తుతం బ్రోక్పా ఉప తెగ జనాభా 1700. బ్రోస్కట్ భాషని మాట్లాడే బ్రోక్పాలు చక్కని మేని ఛాయని కలిగుంటారు. పురాతన తెగగా గుర్తించబడిన బ్రోక్పాల ఆహార అలవాట్లు ఇప్పటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. 2,200 ఏళ్ళ చరిత్రని కలిగున్నది ఈ తెగ. తొలినాళ్ళలో బార్లీ, బంగాళ దుంపలు, యాపిల్, యాప్రికాట్స్ ఈ తెగ ప్రధాన ఆహారంగా వుండేది. అయితే పర్యావరణంలో మార్పులతోపాటు ఇక్కడ సాగుచేసే ఆహార పదార్థాల్లోనూ మార్పులొచ్చాయి. అలా చెర్రీలు, ద్రాక్ష, క్యాబేజ్, కాలీఫ్లవర్, పొట్లకాయ, బీన్స్, బఠాణీ లాంటి వాటిని సాగుచేసి ఆహారంగా తినేవారు. అలా పూర్తి శాకాహార తెగగా బ్రోక్ప గుర్తించబడింది. ఎత్తైన ప్రాంతంలో వుండే ఈ తెగ అతి వేడిమితోపాటు అతి శీతల వాతావరణాల్లో కాయగూరలు, పండ్లని సాగుచేయడం ఆశ్చర్యపరిచే విషయం. కాలానుగుణంగా గోధుమలు మరిన్ని రకాల పండ్లు, కాయగూరలని సాగుచేసే



వారు. 1997–2008 మధ్య కాలంలో ఇక్కడ వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల ఇక్కడి పగటి ఉష్ణోగ్రతల్లో మార్పు ఎక్కువయ్యింది. 2010–15లో ఇక్కడ చోటుచేసుకున్న వరదల కారణంగా బీమా ప్రాంతం పూర్తిగా నీట మునిగింది. ఈ ప్రమాదంలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయింది కూడా బ్రోక్పా తెగకి చెందినవారే. సాగునేలలు పూర్తిగా దెబ్బతినడంతో కొందరు పాలు గుడ్లు, మాంసాహారానికి షిఫ్ట్ అయ్యారు. ప్రకృతితో వచ్చిన మార్పులు అనుగుణంగానే ఈ తెగ ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు వీళ్ళు అంతరించి పోకుండా వుండటానికి కారణమయ్యాయి. శాఖాహారానికే ఫిక్స్ అయితే జీవించడం కష్టమై వీళ్లు ఈ ప్రపంచానికి తెలిసే అవకాశం కూడా వుండేది కాదేమో. ★



నీటి కోసం పగులుతున్న సీమ గొంతులు

విలక్షణమైన, వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వానికి, సాహిత్య ప్రాభవ వైభవాలకు నిలయం రాయలసీమ. తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేక ఉద్యమాలు, వాదాలు, ధోరణులకు ఈ ప్రాంతం సాహిత్య స్థావరంగా, కేంద్రంగా మారింది. ఇక్కడి రచనల్లో సమకాలీన సమస్యలు, సంక్షోభాలు ప్రతిఫలిస్తుంటాయి. తమ అస్తిత్వాన్ని చాటుకోడానికి రాయలసీమ రచయితలు వివిధ సాహితీ ప్రక్రియల్లో కృషి చేస్తున్నారు. అందులో భాగమే రాయలసీమ సాంస్కృతిక వేదిక వెలువరించిన కవితా సంకలనం 'తడి ఆరిన సీమ గొంతుకలు'. ఈ సంకలనంలోని కవితలు, పద్యాలు, పాటలు, వచన కవితలు, మినీ కవితలు 'నీళ్లే నాగరికత... నీళ్లే అభివృద్ధి' అని చెప్పడంతో పాటు నీటి కోసం పగులుతున్న సీమ గొంతుల ఆర్తిని, ఆవేశాన్ని గొప్పగా చెబుతాయి. వస్తుపరంగానూ ఆశావాద ధోరణితోను, గత వైభవాన్ని నెమరువేసుకొనేవిగాను, ప్రస్తుత అన్యాయాన్ని నిగ్గదీసేవిగాను, భవిష్యత్తరాలకు స్ఫూర్తిని నింపేవిగాను వుంటాయి. ముఖ్యంగా నీళ్ల మోసాలు, నీళ్ల రాజకీయాలు, కరువులు, వ్యవసాయ సంక్షోభాలు, రైతుల ఆత్మహత్యలు, వలసలు, నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టులు వంటి పలు అంశాలు ఈ కవితల్లో ధ్వనిస్తాయి. 'తడి ఆరిన సీమ గొంతుక/ బీళ్లకు నీళ్లే కావాలని వేస్తోంది పొలికేక/ రాజనాలు పండించిన రైతన్నకు/ నేడు బతుకూ లేదు మెతుకు లేదు ఎందుకు?' అంటూనే కన్నీరు కారుస్తోన్న కృష్ణానది, నేను చచ్చిన శవాన్ని అంటోన్న పెన్నానది, రైతుకు భద్రత ఇవ్వలేకపోయానంటూ తుంగభద్రా నది పడుతున్న ఆవేదనను తరమెల రాజు ఈ సంకలనం శీర్షిక పెట్టిన 'తడి ఆరిన సీమ గొంతుక' కవితలో అక్షరీకరిస్తారు. 'ఇక్కడొక గాయం సలపరిస్తూ వుంది/ గడ్డకట్టిన వేదన నన్ను పల్కరిస్తూ వుంది/ నాసీమ వర్తమాన చరిత్ర/ జీవరసం ఇంకిపోయిన మట్టిచరిత్ర/ నేతల నిర్లక్ష్యంలోంచి చేజారిన గాజుపాత్ర' అంటూ 'ఇక్కడొక గాయం సలపరిస్తూవుంది' కవితలో

పుస్తకం పేరు : తడి ఆరిన సీమ గొంతుకలు(కవితా సంకలనం)
సంపాదకత్వం : డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి
పేజీలు : 112
వెల : రూ 50/-
ప్రతులకు: కోనాపురం ఈశ్వరయ్య,1/244, మడకశిర రోడ్డు, ఆల్విన్ కాలని, పెనుకొండ, అనంతపురం జిల్లా-515110
సెల్ : 7386623864

ప్రవిస్తోన్న సీమగాయాన్ని హృద్యంగా చెబుతూనే వర్తమాన రాజకీయాలపై చురుక్కుమనే పంచ్‌లు కూడా వేస్తారు కవి. 'రాయలేలిన రత్న గర్భువు నాడు/ రాలుతున్న రైతన్నల శవాల దిబ్బగ నేడు' అంటూ మరో కవితలో నాటి వైభవాన్ని... నేటి కళావిహీన వైనాన్ని కళ్లకు కడతారు. 'అప్పుడెప్పుడో బాల్యంలో/ చదివాను చరిత్ర పుటల్లో / మనది రాయలసీమయని/ కృష్ణదేవరాయలేలిన రత్నాల సీమయని' అంటూ గతాన్ని నెమరు వేసుకుంటారు మరోకవి. 'వాన నీటిచుక్క నన్ను సోకి చిట్లితే/ పరిమళాన్ని వెదజల్లే/ రేగడి మట్టి నవ్వాలని కలగంటున్నాను' అంటూ చినుకు కోసం చినుకు కోసం.. భూమి ప్రసవం కోసం కలగంటారు మరో కవి.

ఇదే విధంగా ఈ కవితా సంకలనంలోని ప్రతి కవితలోనూ ఓ కల, ఓ ఆశ, ఓ వేదన, ఒకింత నిర్వేదం, మరొకింత ఆవేశం కనిపిస్తుంది. కవితా వస్తువును అవసరమైన మేరకు వర్ణనలతో హృదయానికి హత్తుకునేలా చెప్పడం, పఠితులకు సీమ కరువును, కన్నీటిని కళ్లకు కట్టినట్టుగా వర్ణించడం ఈ సంకలనంలో చేర్చిన ప్రతి కవితలోనూ కనిపిస్తుంది. సాహిత్యాభిలాషులను ఆకట్టుకోవడమేగాక, సీమ దాహం తీర్చేందుకు కంకణబద్ధులై తమ కవితాస్త్రాలను సంధించే మరికొందరు కవులు వెలుగులోకి రావడానికి ఈ కవితాసంకలనం ఎంతగానో దోహదపడుతుంది.

- రాజాబాబు కంచర్ల



కెప్టెన్ నిరీక్షణ

ఓ కుక్క యజమాని రాక కోసం పదేళ్లుగా అదే ప్రాంతంలో ఎదురుచూస్తోంది. దాన్నేమీ యజమాని వదిలేసి పోలేదు. లేదా ఆయనేదో పని మీద వేరే ప్రాంతం వెళ్లిపోలేదు. ఆయన పదేళ్ల క్రితం చనిపోయాడు. ఆ శునకం ఆయన సమాధి వద్దే పడిగాపులు పడుతోంది. నిద్ర పోతున్నాడేమో తిరిగి లేచి వస్తాడేమో అనుకుంటోంది. దాని పేరు కెప్టెన్. అర్జెంటినాలోని విల్లా కార్లోస్ పాజ్ పట్టణానికి చెందిన మిగ్యెల్ గుజ్‌మన్ దాన్ని పెంచుకునేవాడు. 2006లో ఆయన చనిపోయాడు. ఇంటికి తిరిగి వస్తాడులే అనుకుని అది ఎదురుచూసేది. ఆయన ఎంతకీ తిరిగిరాకపోయే సరికి చివరిసారిగా ఆయన ఎక్కడికెళ్లాడో ఆ ప్రాంతం వెతుకుతుండేది. కొన్ని నెలల తర్వాత ఆయన ఇంటిని యజమాని భార్య వెరోనికాను విడిచిపెట్టి కెప్టెన్ ఎటో వెళ్లిపోయింది. కెప్టెన్‌ను వెతుక్కుంటూ గుజ్‌మన్ కుటుంబం పట్టణమంతా గాలిస్తే చివరకు ఆయన సమాధి వద్ద అది కూర్చుని కనిపించింది. మిగ్యెల్ కొడుకు డైమెన్ ఎన్నిసార్లు దాన్ని ఇంటికి తీసుకువచ్చినా కెప్టెన్ తప్పించుకుని తిరిగి సమాధి వద్దకు చేరేది. ఇక గుజ్‌మన్ కుటుంబం దాన్ని అక్కడే ఉండనిచ్చి ఆహారం తీసుకెళ్లడం మొదలెట్టారు. సమాధి నిర్వాహకులు దాని విశ్వాసానికి అభిమానులుగా మారిపోయారు. కెప్టెన్ బాగోగుల్ని వాళ్లే చూసుకోవడం మొదలెట్టారు. రోజూ తిండి పెట్టడం, ప్రతి ఏటా వ్యాక్సిన్లు వేయించడం వాళ్లే చేసేవారు. అలా ఇక అది ఆ శ్మశానంలోనే ఉండిపోయింది. కేవలం తిండికి మరో అవసరానికి మాత్రమే గుజ్‌మన్ సమాధి నుంచి కదిలేది కానీ మళ్లీ చివరకు దాని చుట్టుతానే పచార్లు కొట్టి అక్కడే కూర్చుకునేది. ఇలా పదేళ్ల పాటు తన యజమాని రాక కోసం కెప్టెన్ ఎదురుచూస్తోంది. ఇప్పటికే దానికి 15 ఏళ్లు వచ్చేశాయి. యజమాని కోసం ఆందోళన పడటంతో ఆరోగ్యమూ క్షీణించింది. చూపు మందగించింది. చాలామందికి ఆశ్చర్యం కలిగించే విషయమేమంటే గుజ్‌మన్ కార్లోస్ పాజ్‌లో చనిపోలేదు. మరో ఊరు కార్డోబాలో చనిపోతే నేరుగా శ్మశానానికి తరలించారు. కెప్టెన్ ఆయన సమాధి జాడ ఎలా కనుక్కోగలిగిందో అర్థం కావడంలేదట. బహుశా కొన్ని రోజుల పాటు ఊరంతా గాలించి చివరకు శ్మశానం పక్కగా వెళ్లినపుడు గుజ్‌మన్ వాసనను పసిగట్టి ఉండొచ్చని అనుకుంటున్నారు. కానీ కొన్ని నెలలపాటు యజమాని వాసనను అది ఎలా గుర్తుంచుకోగలిగిందో అంతు చిక్కడంలేదు. ఏదేమైనా పదేళ్లంటే ఓ కుక్కకు జీవిత కాలం కిందే లెక్క. జీవితాంతం యజమాని రాక కోసం ఎదురుచూస్తున్న కెప్టెన్ కథ చాలామందిని కదిలిస్తోంది. ★

వినూత్నం



బాట్ బొమ్మలు



ఓ మరబొమ్మ మనిషి బొమ్మ గీస్తే...! అదేదో హాలీవుడ్ సైన్స్-ఫై సినిమాలోని సన్నివేశం గుర్తొస్తోంది కదూ. మరబొమ్మ కాకున్నా అచ్చు అలాగే పనిచేసే కొన్ని బాట్‌లున్నాయి. వాటిని ప్లాటర్ బాట్ అంటారు. కొన్ని అల్గారిథమ్‌ల ద్వారా వాటితో చిత్రాలు వేయిస్తుంటారు శాస్త్రవేత్తలు. మన వేళ్ల మధ్య కలాన్ని నిలిపినట్టే వాటి హ్యాండ్‌కు పెన్నును తగిలిస్తారు. ఇక అది ప్రాణమున్న మనిషిలానే చుక్కల్ని, గీతల్ని వేసుకుంటూ పోతుంది. చివరకు చిత్రమంతా పూర్తయ్యేసరికి మనకు మనిషి ముఖం కనిపిస్తుంది. ఏదో సర్రియల్ భావనను కలిగించే ఈ ప్లాటర్ బాట్ చిత్రాలన్నీ కూడా ప్రఖ్యాత చిత్రకారుల స్ట్రోక్స్‌ను గుర్తు తెస్తాయి. వాన్‌గాగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని సెర్గీ స్టాపెల్ అనే సాంకేతికవేత్త తను రూపొందించిన కారెల్ ప్లాటర్ బాట్‌తో కొన్ని బొమ్మలు వేయించాడు. కొన్ని చదరపు సెం.మీ.ల కాగితం మీద అది ఎంతో కచ్చితత్వంతో సెలబ్రిటీల చిత్రాలను గీసిపారేసింది. అయితే ఇవి కొన్ని గీతలు లేదా చుక్కల సమూహాలుగా కనిపిస్తాయి. మొత్తానికి పూర్తి చిత్రం కనిపిస్తుంది. సాధారణంగా పిక్సెల్ లెక్కన చుక్కలు పొడుచుకుంటూ పోయే ప్లాటర్‌లా కాక గీతల వరసలతో చిత్రాన్ని తీర్చిదిద్దడంతో విభిన్నత కనిపించింది. ఇలాంటి 35 వేల వరసలను అంత చిన్న కాగితం మీద గీస్తూ పోవడానికి 2 గంటలకు పైగానే సమయం తీసుకుంది కారెల్. ఇలాంటి చిత్రాల్ని అందమైన ఫ్రేమ్‌ల్లో అలంకరించేసి ఎట్సీ లాంటి ఆన్‌లైన్ వేదికల ద్వారా సెర్గీ అమ్మేస్తున్నాడు. ఓ బాట్ కలంతో బొమ్మ గీయడమే ప్రత్యేకత అనుకుంటే అది వాన్ గాగ్ స్ట్రోక్ ఎఫెక్ట్‌ల్ని ఇవ్వడంతో ఆ చిత్రాలు తెగ పాపులర్ అయిపోయాయి. ఆ తర్వాత ఎ-3 అక్వారెల్లె కాగితం మీద కూడా బొమ్మలు గీయగల స్థాయిలో అల్గారిథమ్ సరిదిద్దుకుని పెద్ద ప్రాజెక్ట్‌నే మొదలెట్టాడు సెర్గీ. ఎప్పటికప్పుడూ అల్గారిథమ్‌లు సరిచేసుకుంటూ చివరకు మాంచి ఆర్టిస్ట్‌గా మార్చేశాడు కారెల్‌ను. నమ్మండి ఈ పక్కనున్న చిత్రాలన్నీ ఓ ప్లాటర్ బాట్ పెన్నుతో గీసినవే. ★



పర్యావరణం రోజు రోజుకీ ప్రమాదకరంగా మారుతోంది. దీనికి కారణం ప్లాస్టిక్ వ్యర్థాలని తెలిసినా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించలేకపోతున్నాం. మనం ఉపయోగించే ఫర్నిచర్, పిల్లల ఆటవస్తువులు, గృ హోపకరణాలతో మన ఇల్లు ఓ ప్లాస్టిక్ హబ్‌గా మారిపోతోంది. మరి ప్లాస్టిక్ ప్రమాదం నుంచి బయట పడాలంటే ప్రత్యామ్నాయం వెతకాల్సిందే. ఆ పనిని హరేష్ మెహతా ఏడేళ్ళ కిత్రమే మొదలు పెట్టాడు. ప్రకృతి పరిరక్షణ ధ్యేయంగా కార్డుబోర్డు వస్తువుల తయారీలో ముందడుగేస్తున్న హరేష్ ఆలోచనని మీరూ తెలుసుకోండి.

అట్ట వడ్రంగి

భారత్‌లో ఏటా 15 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వెలువడుతున్నాయనేది ఓ సర్వే నివేదిక. వీటిలో భూమిలో కలవకుండా మిగిలిపోయినవి 6 వేల టన్నులు అంటే పర్యావరణ కాలుష్యం ఎంత ప్రమాదకర స్థాయికి చేరుకుంటోందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ప్రమాదం నుండి బయటపడాలంటే ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలి. ముంబయికి చెందిన హర్ష మెహత (64) కార్డ్‌బోర్డ్‌తో ఓ కొత్త ఆలోచనే చేశాడు. అదే మెహత నడుపుతున్న పేపర్ షార్పర్ కార్డ్‌బోర్డ్ తయారీ సంస్థ. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే ప్లాస్టిక్, మెటల్, కలపతో తయారుచేబడే రకరకాల వస్తువులకు ప్రత్యామ్నాయంగా మారాయి ఈ కార్డ్‌బోర్డు వస్తువులు. చిన్నారులకి సంబంధించిన ఆటవస్తువులూ, ఉయ్యాలలు, టేబుల్స్‌తోపాటు పెద్దలు ఉపయోగించే కుర్చీలు, హ్యాంగర్స్, స్టూల్స్, సింగిల్ బెడ్స్, సోఫాలు, స్టోరేజ్ బాక్సులు, ల్యాప్‌టాప్ బ్యాగ్‌లు, సిడి ర్యాక్స్, డస్ట్‌బిన్‌లు, టేబుల్ దీపాలు, ఇలా ఇక్కడ లభించే వస్తువులు అన్నీ కార్డుబోర్డుతో తయారుచేసినవే. వివిధ పొరలతో దట్టంగా ఉండే ఒక ప్రత్యేకమైన కార్డ్‌బోర్డుని ఈ వస్తువుల తయారీలో ఉపయోగిస్తారు. తయారీ నుండి ప్యాకింగ్ వరకు ఎక్కడా ప్లాస్టిక్ అనే మాటే వినపడదు. ఆన్‌లైన్ ద్వారా మనం కొనుక్కునే వస్తువుల ప్యాకింగ్‌కి ఉపయోగించే కార్డుబోర్డ్ కంటే పూర్తి ప్రత్యేకమైన కార్డ్‌బోర్డ్‌ని పేపర్ షార్పర్ ప్యాకింగ్‌కి ఉపయోగిస్తుంది. ఇది వస్తువులు డ్యామేజ్ అవ్వకుండా భద్రతతో పాటు తక్కువ బరువుని కలిగుండే ఈ ప్యాకింగ్‌ల ద్వారా సమయానికి ఆర్డర్లని అందించగలుగుతున్నారనేది హరేష్ అభిప్రాయం.

ఆలోచన మొదలయ్యిందిలా....

ముంబయిలోని ఒక ప్యాకింగ్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు హరేష్ తండ్రి. అట్టముక్కలని వేరుచేయడం, మడవడం, వాటిని సమాన వరుసలో పేర్చడం ఇలా ఫ్యాక్టరీలో తండ్రిచేసే పనులన్నీ ఓ మూల కూర్చుని పరిశీలించేవారు హరేష్. జయన్ ప్యాకింగ్ పేరుతో నడిపే ఆ ఫ్యాక్టరీ మూతబడింది. దాదాపు హరేష్ చిన్ననాటి జ్ఞాపకాలన్నీ ఇలా పేపర్ తయారీతోనే ముడిపడ్డాయి. అప్పుడే తనకి ఆ వృత్తి పైన ఇష్టం పెరిగింది. బడి చదువు తర్వాత తండ్రి వత్తిడితో ఇంటర్‌లో చేరినా దాన్ని మధ్యలోనే మానుకున్నాడు. ఇప్పుడు అక్కడే తన పేపర్ షార్పర్‌ని ప్రారంభించాడు హరేష్. కార్డ్‌బోర్డ్‌తో రకరకాల బొమ్మలు, అలంకరణ వస్తువులని తయారుచేసే జపాన్ వారి ఒరిగామీ కళకి ఆకర్షితుడయ్యాడు. అలా సొంతగా కార్డ్‌బోర్డుతో వివిధ వస్తువులని తయారుచేయడం నేర్చుకున్నాడు. మొదట్లో తన కుటుంబం హరేష్ ఆలోచనలకి అడ్డుపడినా తర్వాత తనని అర్థం చేసుకోగలిగింది. సొంత ఆలోచనలతో ఏడేళ్ల క్రితం తను ప్రారంభించిన పేపర్ షార్పర్ ఇప్పుడు ముంబయిలో అతిపెద్ద కార్డుబోర్డ్ గృహోపకరణాలు లభించే దుకాణంగా పేరు గడించింది. ఈ ఏడాది మే నెలలో ఆన్‌లైన్ షాపింగ్‌ని అందుబాటులోకి తేవడంతో చిన్నారులకి మరింత దగ్గరయ్యింది. పేపర్ షార్పర్ పిల్లల కోసం ప్రత్యేకించి తయారుచేసిన కుర్చీలు, టేబుల్స్‌తో పాటు రకరకాల వస్తువులు వారిని ఆకట్టుకుంటున్నాయి. తన కుటుంబానికి సంబంధించిన ఒక పెళ్ళి వేడుకలో తివాచీ, విద్యుత్ దీపాలు, కుర్చీలు ఇలా ప్రతి వస్తువూ కార్డ్‌బోర్డుతో తయారుచేసినవే ఉపయోగించారు. ఆ ఆలోచన ఎంతో మందిలో మార్పు తెచ్చింది. కార్డ్‌బోర్డ్‌ని ఉపయోగించి తను తయారుచేసిన ఎన్నో వస్తువులు మన దేశంలో నిర్వహించిన ఎగ్జిబిషన్స్‌లో ప్రదర్శింపబడ్డాయి. ప్రముఖ కంపెనీ క్యాబిన్‌లలోని వస్తువులు హరేష్ ఆలోచనలతో రూపుదిద్దుకున్నాయంటే తన కృషేంటో అర్థమవుతుంది. ఇలా పేరొందిన కంపెనీలకే కాదు లేహ్, లఢక్ ప్రాంతాల్లో మహిళల కోసం లూలూ బాక్స్‌లను తయారుచేశాడు. అక్కడ ప్రయాణాల్లో మూత్ర విసర్జన మహిళలు ఎదుర్కొంటున్న సమస్య. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒకటి రెండు టాయిలెట్స్ అపరిశుభ్రంగా వుండటంతో వాటిని మహిళలు ఉపయోగించ లేకపోతున్నారనే విషయాలు హరేష్‌ని కలవరపరిచాయి. ఈ సమస్యకి పరిష్కారదిశగా తనుచేసిన ఆలోచనే లూలూ బాక్స్. ప్రయాణాల్లో తమతో పాటు తీసుకెళ్లేందుకు వీలుగా పూర్తిగా కార్డ్‌బోర్డుతో తయారు చేసిన లూలూ బాక్స్ అక్కడి మహిళల సమస్యకి చక్కటి పరిష్కారాన్ని అందించింది. ప్రస్తుతం పిల్లలకి సంబంధించిన ఆటవస్తువులని తయారుచేసే మరో ప్రాజెక్ట్‌ని మొదలు పెట్టాడు హరేష్. ప్రకృతికి హాని తగ్గించే ఇలాంటి వస్తువులు అందరూ ఉపయోగించాలని కోరుకుందాం. ★



కబాబ్

కావాల్సిన పదార్థాలు

ఉడికించిన పచ్చి బఠానీలు-1 కప్పు
ఉడికించిన బంగాళా దుంపలు-రెండు పెద్దవి
పచ్చిమిర్చి-2 పేస్ట్‌లా చేసుకోవాలి
అల్లం పేస్ట్-1/2 టేబుల్ స్పూన్
కొత్తిమీర తరుగు-1/2 కప్పు
జీలకర్ర- టేబుల్ స్పూన్
మిరియాల పొడి-1/4 టేబుల్ స్పూన్
ఉప్పు- తగినంత
నూనె-1/2 కప్పు

తయారుచేసే విధానం

బాణలీలో పెద్ద టేబుల్ సూన్ నూనె వేడిచేసి జీలకర్ర వేయించాలి. అందులో పచ్చిమిర్చి పేస్ట్, పచ్చి బఠాణీలు, ఆలూ ముక్కలు, కొత్తిమీర తరుగు, అల్లం పేస్ట్ తగినంత ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. ఐదు నిమిషాల తర్వాత దింపేయాలి. ఈ మిశ్రమాన్ని కొంచెం కొంచెంగా తీసుకుని బిళ్ళల్లా చేసుకోవాలి. ఇలా చేసుకున్న వాటిని పెనంపై నూనె వేస్తూ ఎర్రగా కాల్చుకుంటే కబాబ్ రెడీ!

స్టఫ్డ్ పూరీలు

కావాల్సిన పదార్థాలు

గోధుమపిండి-1 కప్పు
మైదా-1 కప్పు
పచ్చిబఠాణీలు-1/2 కప్పు
అల్లం పచ్చిమిర్చి పేస్ట్-1/2 కప్పు
గరం మసాలా-1/4 టీ స్పూన్
జీలకర్ర- 1/4 టేబుల్ స్పూన్
ఉప్పు-తగినంత
నూనె-వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

ఓ గిన్నెలో మైదా గోధుమపిండి కొద్దిగా ఉప్పు చెంచా నూనె తీసుకుని సరిపడా నీటితో చపాతీపిండిలా కలిపి పక్కనపెట్టుకోవాలి. ఇది నానేలోగా పచ్చిబఠాణీలను ఉడికించుకోవాలి. ఆ నీటిని వంపేసి గరిటెతోనే వాటిని మెత్తగా మెదిపి పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో చెంచా నూనె వేడిచేసి జీలకర్ర వేయించాలి. అందులోనే పచ్చిబఠాణీల ముద్ద అల్లం పచ్చిమిర్చి పేస్టు, గరం మసాలా తగినంత ఉప్పు వేసి బాగా కలిపి రెండు మూడు నిమిషాలు వేయించి దింపేయాలి.

చపాతీ పిండిని తీసుకుని మరోసారి కలిపి చిన్నచిన్న ఉండల్లా చేసుకోవాలి. ఓ ఉండను తీసుకుని చిన్న పూరీలా వత్తి మధ్యలో పచ్చిబఠాణీల మిశ్రమాన్ని ఉంచాలి. దానిపై మరో పూరిని ఉంచి చివర్లను మూసేసి మరోసారి గుండ్రంగా వత్తాలి. ఇలా చేసుకున్న పూరీలను కాగుతున్న నూనెలో వేసి గోధుమరంగు వచ్చేవరకు వేయించి ఒక ప్లేట్‌లో వుంచాలి. వీటిని వేడి వేడిగా తింటే చాలా

ఢోక్లా

కావాల్సిన పదార్థాలు

బియ్యం-కప్పు
మినప పప్పు-1/2 కప్పు
ఉడికించిన పచ్చిబఠాణీ-1/2 కప్పు
పచ్చిమిర్చి-2
వంటసోడా-చిటికెడు
నిమ్మరసం- 1/2 కప్పు
ఉప్పు-తగినంత
నూనె-కొద్దిగా

తయారుచేసే విధానం

ముందు రాత్రే బియ్యం, మినపప్పు నానబెట్టుకోవాలి. మర్నాడు మెత్తగా పిండిలా రుబ్బుకోవాలి. ఉడికించిన పచ్చిబఠాణీ, పచ్చిమిర్చిని మెత్తగా చేసుకుని రుబ్బి పెట్టుకున్న బియ్యప్పిండిలో కలపాలి. ఇప్పుడు తగినంత ఉప్పు వంటసోడా, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ పిండిని నూనె రాసిన పళ్ళెంలో పరిచి కుక్కరులో ఆవిరి మీద ఉడికించుకోవాలి. పది నిమిషాలయ్యాక దింపేసి డైమండ్ ఆకృతిలో ముక్కల్లా కోయాలి. కావాలంటే తాళింపు పెట్టుకోవచ్చు.



భిన్నమైనదేది

ఇక్కడున్న ఆరు వరుసల్లో కొన్ని బొమ్మలు ఉన్నాయి. అయితే ఒక్కో వరుసలో వున్న బొమ్మల్లో ఒకటి భిన్నంగా ఉంది. అదెక్కడుందో కనిపెట్టండి.





రంగులు అద్దండి

అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. ఇక్కడ ఒక బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. పైనున్న బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.





గుర్తిద్దాం

పిల్లలూ! కొన్ని కార్టూన్ క్యారెక్టర్ల పేర్లను ఇక్కడుంచాం! పైనున్న అక్షరాల పట్టికలో అవెక్కడున్నాయో గుర్తించి పెన్నుతో మార్క్ చేయండి.



O	B	S	K	T	R	I	S	T	E
E	Q	C	A	N	S	A	D	O	X
S	L	D	W	H	O	U	M	B	P
O	G	A	I	E	R	Y	G	A	C
R	Z	V	R	N	G	T	J	M	K
P	R	E	O	C	U	P	A	D	O
R	A	R	D	P	L	F	L	F	L
E	J	G	C	N	L	Q	E	V	O
N	I	O	H	T	O	U	G	S	R
D	R	N	Y	C	S	A	R	W	A
I	X	Z	V	D	O	F	E	Z	R
D	B	A	S	U	S	T	A	D	O
O	E	D	P	R	G	L	S	I	T
Q	K	O	H	V	O	J	N	U	W
M	F	R	U	S	T	R	A	D	O



నేర్చుకుందాం

పిల్లలూ మీకు బొమ్మలు గీయడమంటే భలే ఇష్టం కదా! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ పక్షిబొమ్మని ఎలా గీయాలో ఇక్కడుంచారు. మీరూ ప్రయత్నించండి.

కనిపెట్టండి





చింటు ప్రయాణిస్తున్న ఈ రైల్లో మన ఇంట్లో వుండే కొన్ని వస్తువులు దాగున్నాయి. పక్కనున్న బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనిపెట్టేయండే.

ఫింగర్ పపెట్



తయారుచేసుకునే విధానం

ముందుగా పైప్‌క్లీనర్ ఒక చివర పట్టుకుని ఎవరి కోసం ఈ బొమ్మని తయారుచేస్తున్నారో వాళ్ళ చేతి వేలికి చివరి వరకు చుట్టాలి. కాస్త బిగువుగా వుండేలా చూసుకొని మరో చివరని బొమ్మలో చూపిన విధంగా చెవుల ఆకారంలో మడిచి గమ్‌తో అతికించుకోవాలి. ఇప్పుడు చెవుల భాగం కింద తెలుపు రంగు పామ్ పామ్‌ని గమ్‌తో అతికించాలి. ఇవి పూర్తిగా ఆరిన తర్వాత గూగుల్ కళ్లని ముఖ భాగంలో అతికించాలి. ఇది పూర్తిగా అరిన తర్వాత మరో పైప్ క్లీనర్‌ని తీసుకుని మెడ భాగంలో ముడి వేయాలి. ఇలా పపెట్స్‌ని తయారు చేసి మీ చిట్టి చెల్లెళ్లు, తమ్ముళ్లతోపాటు ఫ్రెండ్స్‌కి ప్రెజెంట్ చేయండి. మీకు నచ్చిన రంగు పైప్ క్లీనర్లని ఉపయోగించి కూడా ఈ ఫింగర్ పపెట్స్‌ని తయారు చేసుకోవచ్చు.



పిల్లలు మీరు టీవీలో, మిమిక్రీ షోల్లో రకరకాల పపెట్‌లని చూసే వుంటారు. అయితే మీ చిట్టి చేతివేళ్ళకు సరిపోయే చిన్న పపెట్స్‌ని మీరే తయారుచేసుకోవచ్చు. మన ఇంట్లో దొరికే వస్తువులతో అవెలా తయారుచేసుకోవచ్చో మేం నేర్పిస్తాం. మీరు వాటిని జాగ్రత్తగా తయారుచేసి మీ చిట్టి చెల్లెలు, తమ్ముడితోపాటు మీ ఫ్రెండ్స్‌కి ఇచ్చి వాళ్ళని సర్‌ప్రైజ్ చేయండి.

కావాల్సిన వస్తువులు : పైప్ క్లీనర్ (గులాబి రంగు)-1, పామ్ పామ్(చిన్నది)-1, గూగుల్ కళ్లు-2, గమ్, కత్తెర.

పదవికాసం 72

కూర్పు : రావెళ్ల

1		2		❀	3	4		5
	❀		❀	6	❀		❀	
7		❀	8			❀	9	
	❀	10	❀		❀	11	❀	
❀	12			❀	13			❀
14	❀		❀	15	❀		❀	16
17		❀	18			❀	19	
	❀	20	❀		❀	21	❀	
22	21			❀	22			

ఆధారాలు

అడ్డం

1. పది రాత్రుల సమూహం (4)
3. ఉదయంపూట తినే ఆహారం (4)
7. లంఘించు (2)
8. కాల్చడం (3)
9. ఆశాలతలో తీగలేదు (2)
12. ఆలోచన (3)
13. ఉల్లి గడ్డ (3)
17. ఉగ్రవాద చర్యలను ఆరికట్టే చట్టం (2)
18. పండు (3)
19. ఓ అమ్మయి పేరు (2)
22. పంటి నొప్పి (4)
23. దిండు (4)

నిలువు

1. సమీపం (4)
2. పోగు (2)
4. సిగ్గు (2)
5. నాటకశాల (3)
6. ఓర్పు (3)
10. అలసట (3)
11. ప్రాయం (3)
14. ఘంట చప్పుడు (4)
15. మాసిక (3)
16. విజయవాడకు పాత పేరు (4)
20. సున్న తిరగబడింది (2)
21. నీరు (2)

సుడోకు

	7	5		9				6
	2	3		8			4	
8					3			1
5			7		2			
	4		8		6		2	
			9		1			3
9			4					7
	6			7		5	8	
7				1		3	9	

గతవారం జవాబులు

6	5	7	9	4	1	2	3	8
1	2	3	6	5	8	9	4	7
8	9	4	2	3	7	6	5	1
7	6	5	1	2	3	4	8	9
2	3	1	8	9	4	5	7	6
9	4	8	7	6	5	1	2	3
5	1	2	3	7	6	8	9	4
3	8	9	4	1	2	7	6	5
4	7	6	5	8	9	3	1	2

❀	1 ఉ	2 పా	యం	❀	3 ద్ర	4 వి	ణం	❀
5 చి	❀	క	❀	6 పా	❀	ల్లు	❀	❀
7 ల్ల	డొ	❀	8 కా	వ	లి	❀	9 సా	10 ము
ర	❀	11 అ	❀	లా	❀	12 అ	❀	ని
13 దే	హ	శు	ద్ధి	❀	14 సి	ణా	ర	వా
వు	❀	భం	❀	15 ము	❀	లు	❀	హ
16 ఋ	కు	❀	17 స	వ్వ	డి	❀	18 తా	ను
❀	❀	19 చ	❀	లు	❀	20 గో	❀	డు
❀	21 పో	లి	క	❀	22 గు	ల	క	❀

కదలాడిన చిత్రాలు





ఇవి సుదీర్ఘకాల చిత్రాలు. ఓ లిప్తపాటు కాలంలో తీసేవే మనం సాధారణంగా చూసే ఛాయాచిత్రాలు. అదే కొంతకాలం పాటు జరిగే విషయాన్ని ఫొటో తీస్తే అదీ వెలుగుల్ని ఎక్స్‌పోజ్ చేస్తే ఇలాంటి అబ్బుర ప్రపంచం కళ్లకు కొత్తగా కనిపిస్తుంది. లాంగ్ ఎక్స్‌పోజర్ చిత్రాలు తీయాలంటే డిటైల్స్, లైట్స్ మీద కనికట్టు తెలియాలి. అప్పుడే విరబూసుకున్న వెలుగులు, విన్యాసాలు చేసే కాంతులు ఫ్రేమ్‌లో స్తంభించిపోతాయి. దీపపు పురుగులు, విమానాలు, ట్రామ్‌లు, కయాక్‌లు ఇలా అన్నీ రంగుల వెలుగుల పరుగుల్ని అందుకుంటాయి. భవంతులు, క్రిస్టమస్ చెట్లు, దీప స్తంభాలు కాంతుల్ని గడ్డకట్టిస్తాయి. సరికొత్తగా కదలాడే ప్రపంచాన్ని స్టిల్ ఫొటోగ్రఫీలో చూసి విస్మయంలోకి కదిలిపోండి.







బతుకు చిత్రం

రాతిని చీల్చుకు బతుకు. మోడును పెనవేసుకు బతుకు. కొండ వాలున వేలాడి బతుకు. ఎడారి తావున బతుకు. నీటి మధ్యన తావు వెతుక్కుని బతుకు. కానీ ప్రయత్నించు.. పోరాడు... శ్వాసించు.. శ్వాసనివ్వు. జీవించు.. జీవాన్నివ్వు. చెట్టు బతుకు చిత్రమిది. మనుగడ విచిత్రమిది. ఈ చిత్రాలను తదేకంగా చూస్తుంటే మనకూ ఏదో పోరాట స్ఫూర్తి ఊపిరినిస్తోంది కదూ. అనేక ప్రతికూలతల్ని తట్టుకుని పచ్చదనాన్ని నింపుకునే ఈ ప్రకృతి దృశ్యాలు మీ కోసమే.















Check List

Book Number	KNSR02B181	Date	3/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	chaklami	Cutting By	chaklami
Scanned By	prathyu	Pages	29